ఈనాడు కర్ణాటక
శనివారం అక్టోబరు 5, 2024



నవదుర్గ.. పాహిమాం: బళ్లారిలోని విద్యానగర్ అభయాంజనేయ ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో చిన్నారులు నవ దుర్గలుగా చేసిన నృత్య ప్రదర్శన ఆసాంతం ఆకట్టుకుంది. మాజీ మేయర్ రాజేశ్వరి కళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఆలయ ధర్మకర్త భాస్కర్‌చౌదరి, బోయపాటి విష్ణువర్ధన్, శ్రీనివాసరెడ్డి, కొండయ్య, మోహన్‌దాసు, రవిచంద్ర, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, బళ్లారి గ్రామీణ

చెన్నపట్టణలో అభివృద్ధి పనులు ప్రారంభం



భూమిపూజలో మంత్రి రామలింగా రెడ్డి, స్థానిక నేతలతో శివకుమార్

రామనగర, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికల తేదీని పది రోజుల్లో ప్రకటిస్తారని ప్రచారం జరుగుతున్న వేళ, చెన్నపట్టణలో వివిధ అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గ పరిధిలోని బేవూరు, మాకళి, కెళగెరె, నాగరవా గ్రామాల్లో రూ.4.70 కోట్ల ఖర్చుతో కాంక్రీటు రహదారి నిర్మాణం, మురుగు కాలువల మరమ్మతులను ప్రారంభించారు. బేవూర గ్రామంలో పేదల కోసం నిర్మించిన 101 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. టయోటా సంస్థ సహకారంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కొత్త తరగతి గదులను ప్రారంభించారు. మంత్రి రామలింగారెడ్డి, స్థానిక నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కొత్వాలు చెంతకు నివేదిక

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: పరప్పన అగ్రహార కారాగారంలో నటుడు దర్శన్, రౌడీ షీటరు విల్సన్ గార్డెన్ నాగ, ఇతరులకు రాజాతిథ్యం ఇచ్చిన సిబ్బందికి సంబంధించిన దర్యాప్తు నివేదికను నగర పోలీసు కమిషనర్ దయానంద్ శుక్రవారం అందుకున్నారు. బ్యారక్‌ల మధ్య కుర్చీలు వేసుకుని సిగరెట్టు, కాఫీ తాగుతున్న రౌడీషీటర్లు, దర్శన్ ఫొటో బయటకు రావడంతో వారందరినీ ఇప్పటికే వేర్వేరు కారాగారాలకు తరలించారు. ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తు నివేదికను డీసీపీ సారా ఫాతిమా కొత్వాలుకు అందజేశారు. దర్యాప్తును కొనసాగించి, పూర్తి నివేదిక ఇవ్వాలని కొత్వాలు దయానంద్ ఆమెకు సూచించారు.

విచారణ నేటికి వాయిదా

బెంగళూరు (మల్లేశ్వరం): తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ నటుడు దర్శన్ వేసుకున్న అర్జీ విచారణ నేటి (శని) మధ్యాహ్నానికి వాయిదా పడింది. దర్శన్ తరపున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనలను వినిపించారు. దర్యాప్తు సమయంలో పోలీసులు పలు సాక్ష్యాలను విస్మరించారని, మరికొన్నింటిని పొరపాటున నాశనం చేశారని నాగేశ్ పేర్కొన్నారు. విచారణ, దర్యాప్తునకు, ఇప్పటి అభియోగపత్రానికి పొంతన లేదన్నారు. వాదనలు ఆలకించిన న్యాయమూర్తి విచారణను నేటికి వాయిదా వేశారు.

పెకలిన కబ్జా కోరలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సీవీ రామనగర ప్రాంతంలోని కగ్గదాసపుర చెరువు ఆక్రమణలను పాలికె అధికారులు తొలగించారు. శుక్రవారం ఇక్కడ గట్టి పోలీసు బందోబస్తు మధ్య అధికారులు జేసీబీ యంత్రాల సాయంతో నిర్మించిన ప్రహరీ, రెండు షెడ్లను కూల్చివేశారు. రూ.2 కోట్ల విలువైన 2.50 ఎకరాల భూమి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టు కంచె ఏర్పాటు చేశారు.

హస్తిన గుప్పిట.. వారసుడి చిట్టా

- కాంగ్రెస్‌లో కొనసాగుతున్న మల్లగుల్లాలు
- సిద్ధుపై ఆరోపణల ఫలితం



పరమేశ్వర్‌తో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

ఈనాడు, బెంగళూరు: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చుట్టుముట్టిన ముడా ఆరోపణలు ఆయన రాజకీయ జీవితానికి సవాలుగా మారాయి. రోజుకో రూపంలో ఈ కేసు మలుపు తిరుగుతోంది. ఇప్పటికే లోకాయుక్త, ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించగా ఏ క్షణంలోనైనా ముఖ్యమంత్రి విచారణకు హాజరవాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఆయన పదవీ త్యాగం అనివార్యంగా మారగలదు. ఆ సమయమే ఆసన్నమయితే ఉన్నపళంగా సిద్ధు వారసుడిని వెతకటం కష్టమే. అందుకు ఇప్పటి నుంచే అధిష్ఠానం సన్నాహకాలు చేస్తున్నట్లే కనపడుతోంది. సిద్ధరామయ్య రాజకీయ వారసుడు ఎవరన్నది నేటికీ శేష ప్రశ్నే అయినా ఆ పీఠానికి అర్హులు దండిగానే ఉన్నారు. గత నెల రోజులుగా ఈ అర్హత ఉందని భావించే వారంతా బెంగళూరు, దిల్లీల మధ్య మంతనాలు సాగిస్తూ కాంగ్రెస్ శిబిరంలో సందడి చేస్తున్నారు. మరోవైపు సిద్ధరామయ్య తర్వాత ఆ నాయకత్వాన్ని అందిపుచ్చుకోవాలని ఉవ్విళ్లూరుతున్న డీకే శివకుమార్ ఇటీవలి కాలంలో కాస్త మౌనంగా కనిపిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.

వారి సమావేశం అందుకేనా?

సిద్ధరామయ్య రాజకీయ వారసత్వాన్ని అందుకునేందుకు ఆయన మద్దతుదారులు ఎందరో ఉన్నారు. వారిలో సతీశ్ జార్ఖిహొళి, డా.జి.పరమేశ్వర్, డా.హెచ్.సి.మహదేవప్ప..ఇలా సీనియర్ మంత్రులంతా సిద్ధు తర్వాత కీలకమైన పీఠంపై కన్నేసినట్లే కనిపిస్తోంది. ఇటీవల మైసూరులో హెచ్.సి.మహదేవప్ప నివాసంలో వీరంతా సమావేశమవటంతో ఊహలకు రెక్కలొచ్చినట్లే కనిపించింది. గత నెల రోజుల్లో ఇలాంటి సమావేశాలు నిర్వహించటం మూడోసారి. ఈ సమావేశానికి తెరవెనుక ప్రాతినిధ్యం వహించింది కూడా సిద్ధరామయ్య అన్న వార్తలు వినిపించాయి. అందుకు కారణం లేకపోలేదు. అనివార్యంగా రాజీనామా చేయాల్సి వస్తే ఆయన తర్వాత సీఎం కాగలిగిన నేతను ఎంపిక చేయాల్సిన బాధ్యత కూడా సిద్ధరామయ్యపైనే ఉంది. అందుకోసమే ఈ కసరత్తు సమావేశాలు నిర్వహిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై గత నెల దిల్లీకి వెళ్లిన డా.జి.పరమేశ్వర్ అధిష్ఠానంతో చర్చించినట్లు తెలిసింది. గతవారం నిర్వహించిన సమావేశం తర్వాత మరో నేత సతీశ్ జార్ఖిహొళి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చించటం గమనార్హం. వరుసగా ఈ నేతలంతా దిల్లీకి వెళ్లివస్తుండటం నాయకత్వ మార్పునకు సంకేతాలు మరింత స్పష్టంగా ఇచ్చినట్లైంది.

త్వరలో దిల్లీ బాటలో సీఎం



మహదేవప్ప

తనపై ఆరోపణలు, లోకాయుక్త, ఈడీ కేసులు నమోదైన తర్వాత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లింది లేదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు వచ్చి వెళ్లారు. ఈ సందర్భంగా ఆరోపణలున్నా, కేసు నమోదైనా ముఖ్యమంత్రి మార్పు ప్రస్తావన పార్టీ వర్గాల్లో లేదని ఖర్గే తేల్చి చెప్పారు. మేమంతా సిద్ధు వెంటే ఉన్నాం. ఆయన పార్టీకి ప్రతినిధి. ఆయన రాజీనామా చేస్తే పార్టీ తప్పును అంగీకరించినట్లేనని ప్రకటించారు. ఇటీవల కాలంలో సిద్ధరామయ్య రాజీనామాపై విపక్షాల నుంచే కాకుండా పార్టీ లోపలా డిమాండ్ వస్తున్నట్లు తెలుస్తోంది. పైగా పలు రాష్ట్రాలకు ఎన్నికలు, రాష్ట్రంలోనూ మూడు శాసనసభ, ఒక శాసనమండలికి ఎన్నికలు ఉన్న కారణంగా ప్రచారంలో సిద్ధరామయ్యపై వస్తున్న ఆరోపణలు మరింత పదునెక్కే ప్రమాదం ఉంది. ఈ కారణంగా రాజీనామా విషయంపై అధిష్ఠానంతో చర్చించేందుకు ముఖ్యమంత్రి ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం కారణంగా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవటం, దసరా ఉత్సవాల కారణంగా సిద్ధరామయ్యకు సమయం దొరకకపోవటంతో దిల్లీ పర్యటన వాయిదా పడుతూ వస్తోంది. దసరా పండగ తర్వాత దిల్లీకి వెళ్లే ముఖ్యమంత్రి రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, నాయకత్వ విషయాలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకునే వీలుంది.

దళిత సీఎం?



సతీశ్ జార్ఖిహొళి

ప్రస్తుతం రాష్ట్రంలో దళిత ముఖ్యమంత్రి వాదన తెరపైకి వస్తోంది. దశాబ్దాలుగా ఉన్న దళిత సీఎం డిమాండ్ నెరవేరేందుకు ఇదే సరైన సమయమని ఆ సముదాయానికి చెందిన నేతలు ఆశాభావంతో ఉన్నారు. డీకే శిబిరానికి పోటీగా దళిత సీఎం వాదనను తెరపైకి తెచ్చిన అహింద నేతలు ఆ వరుసలో డా.జి.పరమేశ్వర్, డా.హెచ్.సి.మహదేవప్పలను ముందు వరుసలో కూర్చొబెట్టగా, ఎస్టీ నేతగా సతీశ్ జార్ఖిహొళి పోటీలో ఉన్నారు. వీరంతా కాదనుకుంటే ఏఐసీసీ మల్లికార్జున ఖర్గే సైతం పోటీలో వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. విధానసభ ఎన్నికల తర్వాత తన సోదరుడు డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రి చేయాలని తీవ్రంగా శ్రమించిన మాజీ ఎంపీ డీకే సురేశ్ శుక్రవారం ఉన్నట్లుండి రానున్న ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎం అంటూ చేసిన వ్యాఖ్య కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

మూడు కళాశాలలకు బాంబు బెదిరింపు

బెంగళూరు (సదాశివనగర): 'మీ కళాశాలలలో బాంబు పెట్టాం. త్వరలో అది పేలిపోతుంది' అంటూ మూడు కళాశాలలకు ఇ-మెయిల్‌లో శుక్రవారం బెదిరింపులు ఇచ్చాయి. బీఐటీ, ఎంఎస్ రామయ్య, బీఎంఎస్ కళాశాలలకు వచ్చిన బెదిరింపులపై కళాశాలల యాజమాన్యాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. బాంబు నిష్క్రియ దళం, శ్వానదళంతో వచ్చిన సిబ్బంది మూడు చోట్లా క్షుణ్ణంగా తనిఖీలు పూర్తి చేసి అది ఉత్తుత్తి బెదిరింపుగా తేల్చారు. తదుపరి దర్యాప్తు బాధ్యతలను ఆయా ఠాణాల పోలీసులకు అప్పగించారు.

ఈడీ దాడులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: జాతీయ బ్యాంకుల్లో సేవలు అందిస్తున్న అధికారులు, ఉద్యోగుల నివాసాలపై ఈడీ అధికారులు గురువారం సాయంత్రం దాడి చేశారు. శుక్రవారం సాయంత్రం వరకు దాడి కొనసాగింది. బెంగళూరులో ఐదు చోట్ల దాడులు జరిగాయి. ఉద్యోగుల నివాసాల నుంచి పలు దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులను ఈడీ అధికారులు జప్తు చేసుకున్నారు. మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌కు చెందిన నగదును వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలపై దిల్లీలోని ఈడీ ముందుకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ దాడులు జరిగాయని సమాచారం.

స్టే ఇచ్చిన ధర్మాసనం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: క్యాబ్‌లో ప్రయాణిస్తున్న ఓ యువతిపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో బాధితురాలికి ఓలా సంస్థ రూ.5 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని ఏకసభ్య పీఠం ఇచ్చిన ఆదేశాలపై జస్టిస్ ఎస్ ఆర్ కృష్ణమూర్తి, జస్టిస్ ఎంజీ ఉమ పీఠం శుక్రవారం స్టే ఇచ్చింది. డ్రైవరు తమ సంస్థ ఉద్యోగి కాదని, ఒప్పంద పద్ధతిలో సేవలు అందిస్తున్నాడని ఓలా క్యాబ్ మాతృ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ తరపు న్యాయవాది తెలిపారు. దిగువ పీఠం ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని వేసుకున్న అర్జీపై స్టే విధించిన న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబరు 28కి వాయిదా వేసింది.

సీసీబీపై ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో గత మే 19న జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్న వారి నుంచి సీసీబీ పోలీసులు నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని సహ కార్యకర్త విజయ్ డెన్నిస్ ఆరోపించారు. మీపై కేసు లేకుండా చేయాలన్నా, మాదక ద్రవ్యాలు తీసుకోలేదని నివేదిక ఇవ్వాలన్నా నగదు ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఆయన శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ రికార్డింగ్‌లు, కొన్ని వాట్సప్ స్క్రీన్ షాట్లను ఆయన తన ఫిర్యాదు ప్రతితో, రెండు చోట్లా దాఖలు చేశారు. కొందరి నుంచి రూ.10 లక్షలు, మరికొందరి నుంచి రూ.4.2 లక్షలను డిమాండ్ చేశారని విజయ్ డెన్నిస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిరుద్యోగుల శివాలు



ధర్నాలో సమాఖ్య ప్రతినిధుల నినాదాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలో సేవలు అందిస్తున్న పీడీవో కార్యదర్శులు, గుమస్తాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జవాన్లు తదితర సిబ్బంది ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శుక్రవారం విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. వేర్వేరు జిల్లాలు, తాలూకాల నుంచి వచ్చిన ఉద్యోగులు స్వాతంత్ర్య ఉద్యానంలో బైఠాయించారు. పీడీవో పోస్టులను బీ గ్రేడుకు ఉన్నతీకరించడం, సీనియారిటీకి అనుగుణంగా పదోన్నతులు, సిబ్బంది అందరికీ సకాలంలో పదోన్నతులు ఇవ్వడం, పీఎఫ్, బీమా సదుపాయాలు కల్పించడం, జిల్లా పంచాయతీ సీఈవో అధికారి పోస్టులకు గెజిటెడ్ అధికారులను నియమించడం ప్రధాన డిమాండ్లని పంచాయతీ రాజ్ ఉద్యోగులు, సిబ్బంది, సభ్యుల సమాఖ్య అధ్యక్షుడు వరదరాజు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే తమ ఆందోళనను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమాఖ్య డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న పోరాటానికి భాజపా ఎమ్మెల్సీ చలువాది నారాయణ స్వామి మద్దతు ప్రకటించారు.

కల్యాణ కర్ణాటక ప్రగతికి గోవిందరావు సమితి



సింధనూరు వీధుల్లో ఊరేగుతున్న ముఖ్యమంత్రి సిద్ధు, మంత్రులు

సింధనూరు, న్యూస్‌టుడే: నంజుండప్ప నివేదిక అమలులో జరుగుతున్న లోటుపాట్లను గుర్తించి వాటిని క్రమ పద్ధతిలో అమలు చేయడానికి కొత్తగా గోవిందరావు సమితిని ఏర్పాటు చేశాం..గోవిందరావు సమితి నివేదిక అందాక కల్యాణ కర్ణాటకను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. శుక్రవారం రాత్రి స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన సింధనూరు దసరా ఉత్సవాల ప్రారంభ వేడుకలో పాల్గొని ఆయన మాట్లాడారు. మాకు పాత మైసూరు, మంగళూరు-ఉడిపి ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి కల్యాణ కర్ణాటకలోనూ చూడాలన్నదే ఆశ. మా ప్రభుత్వం దీనికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవల కలబురగిలో జరిపిన ప్రత్యేక మంత్రిమండలి సమావేశంలో ఏకకాలంలో రూ.11 వేల కోట్లు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశాం, ఒకే ఒక్క కేబినెట్లో ఇంత పెద్దమొత్తంలో అభివృద్ధికి పచ్చ జెండా ఊపడం ఇదే తొలిసారి అని చెప్పారు. 371జే కృప మా కాంగ్రెస్ ప్రభుత్వానిదే. దీనికి కృషి చేసిన మా నేతలకు ఈ ప్రాంతం ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారని గర్వంగా చెప్పారు. తొలుత ఆయన రూ.1695 కోట్లతో సింధనూరు-కల్మల (రాయచూరు) 78 కిలోమీటర్ల పొడవునా నాలుగు లైన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి, మంత్రులు శరణప్రకాశ్ పాటిల్, హెచ్.కె.పాటిల్ మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎస్ బోసురాజు, తంగడిగి, ఎంపీ రాజశేఖర్, ఎమ్మెల్యేలు ఆర్.బసనగౌడ, హంపయ్యనాయక్, దద్దల్, నాగరాజు, ఎస్.సి.బాలకృష్ణ రాఘవేంద్ర హట్నాళ్ పాల్గొన్నారు.

వైద్య సీటు ఇప్పిస్తామని వంచన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: మీ కుమార్తెకు మెడికల్ సీటు ఇప్పిస్తామని పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక పారిశ్రామికవేత్త నుంచి రూ.1.57 కోట్లు తీసుకుని వంచించిన విరూపాక్ష, మంజప్ప అనే వంచకులను బ్యాటరహళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. పారిశ్రామికవేత్త నుంచి వీరిద్దరూ 2022లో నగదు తీసుకున్నారు. తమ ప్రయత్నాలు విఫలం అయ్యాయని, మీ నగదును షేరు మార్కెట్‌లో మదుపు చేశామని నిందితులు చెప్పారు. త్వరలో ఆ నగదు రెట్టింపు అవుతుందంటూ, రెండేళ్లపాటు కాలం వెళ్లదీశారు. తాను ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలనగా, ప్రాణహాని తలపెడతామని బెదిరిస్తుండడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాచరణ నిర్వహించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణ చేపట్టారు.

కందకంలో పడి గజరాజు విషాదాంతం



కందకంలో ఏనుగు మృతదేహం

మైసూరు, న్యూస్‌టుడే: ఆహారాన్ని వెతుక్కుంటూ నంజనగూడు తాలూకా కెల్లపుర గ్రామానికి వచ్చిన ఒక ఏనుగు కందకంలో పడి మరణించింది. గ్రామానికి సమీపంలోని మల్లహళ్లి వద్ద ఏనుగులు గ్రామాలకు రాకుండా కొన్ని చోట్ల కందకాలు తీశారు. ఆహారం కోసం వచ్చిన 40 ఏళ్ల ఏనుగు కందకంలో పడింది. నడుము విరగడంతో అది మరణించిందని శుక్రవారం ఉదయం గుర్తించారు. దాన్ని క్రేన్ సాయంతో బయటకు తీసి, మరణోత్తర పరీక్షల అనంతరం అటవీశాఖ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

ఇక మెట్రో ఛార్జీల బాదుడు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నమ్మ మెట్రో రైలు ప్రయాణ ఛార్జీలు పెంచనున్నారు. అందుకోసం బీఎంఆర్‌సీఎల్ కొత్త ఛార్జీలను ప్రకటించనుంది. అందులో భాగంగా ముందస్తుగా ప్రయాణికులు, ప్రజలు నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తోంది. ఈనెల 21లోగా తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని మెట్రో రైలు ఛార్జీల నిర్ణయ సమితి విజ్ఞప్తి చేసింది. తమ అభిప్రాయాలు సలహాలను అంతర్జాలం, లేఖలు ద్వారా తమ అభిప్రాయాలను పంపించాలని కోరింది. సమితి ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఛార్జీలను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం కనీస ఛార్జీ రూ.10, తుది ఛార్జీ రూ.60 అమలులో ఉంది. నాజూకు కార్డులు, క్యూఆర్ కోడ్ టికెట్లపై ఐదు శాతం రాయితీ ఇచ్చారు. నిర్వహణ, వేతనాలు, రుణాలు చెల్లింపు తదితర వాటి కారణంగా ఛార్జీలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు. మెట్రో స్టేషన్‌లో ఆత్మహత్య సంఘటనలు ఎక్కువ అవుతుండటంతో స్టేషన్‌ల్లో భద్రత గోడలను ఏర్పాటు చేయాలని బీఎంఆర్‌సీఎల్ తీర్మానించింది. ప్లాట్‌ఫాం భద్రత గోడలు ఏర్పాటుకు రూ.700 కోట్లు నుంచి రూ.800 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ ఖర్చు ప్రయాణికులు భరించాల్సిన పరిస్థితులు వచ్చాయి.

ఎండోస్కోపీపై అవగాహన అంతంతే!



రోగికి ఎండోస్కోపీ చేస్తున్న మహిళా వైద్యులు

ఈనాడు, బెంగళూరు: దేశంలో 45 వేలకు పైగా మహిళా గర్భకోశ (గైనకాలజిస్ట్) వైద్యులున్నారు.. వీరిలో కొందరే ఎండోస్కోపీలో నైపుణ్యం కలిగి ఉన్నారు. ఎండోస్కోపీపై అవగాహన కలిగిన గర్భకోశ నిపుణులు చేసే శస్త్ర చికిత్సలు ఎక్కువ శాతం విజయవంతం అవుతాయి. ఈ విభాగంలో మహిళా గర్భకోశ నిపుణులకు అవగాహన కల్పించేందుకు భారతీయ గైనకాలజికల్ ఎండోస్కోపిస్ట్స్ (ఐఏజీఈ), రాధాకృష్ణ మల్టిస్పెషాల్టీ ఆస్పత్రి, కేఐఏజీఈల నేతృత్వంలో నగరంలో 4వ అంతర్జాతీయ జాతీయ ఎండోస్కోపీ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరులోని ప్రముఖ హోటల్‌లో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో దేశంలోని 400మందికిపైగా స్త్రీరోగ నిపుణులు పాల్గొన్నారు. వీరికి దేశంలో ప్రముఖ ఎండోస్కోపీ వైద్యుల నుంచి ప్రత్యక్ష ఎండోస్కోపీ శస్త్రచికిత్సల ద్వారా అవగాహన కల్పిస్తున్నారని ఈ సమ్మేళనం అధ్యక్షురాలు డాక్టర్ విద్యాభట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 45 వేల మంది మహిళా గర్భకోశ వైద్యుల్లో కేవలం 8వేల మందికే ఎండోస్కోపీపై అవగాహన ఉంది. వీరిలోనూ అత్యధిక శాతం సంప్రదాయ ఎండోస్కోపీలతోనే చికిత్సలు నిర్వహిస్తున్నారు. మారుతున్న ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం ద్వారా తక్కువ సమయంలోనే ఎండోస్కోపీలు నిర్వహిస్తే విధులు నిర్వహించే మహిళా రోగులు తక్కువ సమయంలోనే విధుల్లో చేరే వీలుంటుంది. ఈనెల 6 వరకు నిర్వహించే ఈ సమ్మేళనంలో 20కి పైగా ప్రత్యక్ష (లైవ్) ఎండోస్కోపీ చికిత్సలు, నిపుణులతో చర్చావేదికలు, ఆధునిక విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రాచనగరి.. దసరా సందడి



విద్యుత్తు దీపాల అలంకరణ

మైసూరు, న్యూస్‌టుడే: విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలకు కళ వచ్చింది. శుక్రవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి రాచనగరికి పర్యాటకులు చేరుకున్నారు. మైసూరు వీధులు అన్నింటినీ కలిపి 130 కి.మీ. మేర 21 రోజులు విద్యుత్తు దీపాలంకరణ కొనసాగించనున్నారు. కొన్ని కూడళ్లలో ప్రభుత్వ గ్యారంటీలను తెలిపే బొమ్మలు ఉంచి, వాటిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శ్రీరంగపట్టణలో శుక్రవారమే జంబూ సవారీ నిర్వహించారు. మైసూరుతో పాటు చామరాజనగర, మంగళూరు, తుమకూరు, మడికేరిలోనూ దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజవంశస్థుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు రెండవ రోజైన శుక్రవారం ప్రైవేటు దర్బారు నిర్వహించారు. ఫలపుష్ప ప్రదర్శనకు, వస్తు ప్రదర్శన కేంద్రానికి, క్రీడల పోటీలు, కుస్తీ పోటీలను వీక్షించేందుకు పర్యాటకులు, సందర్శకులు పోటెత్తారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి మైసూరుకు చేరుకునేందుకు ఆర్టీసీ రెండు వేల బస్సులను ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. చాముండి బెట్ట, జూ, శుకవనం, ప్యాలెస్, శ్రీరంగపట్టణ త్రివేణి సంగమం, బృందావన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంది. కొందరు పర్యాటకులు టాంగాల్లో ప్రయాణిస్తూ నగరంలోని ప్రధాన వీధుల్లో తిరిగారు. గోల్డ్ పాస్‌లు ఉన్న వారు టికెట్లు చెల్లించకుండానే పలు ప్రాంతాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు. ఎక్కువ మంది పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో నగరంలో 14 వేల సీసీ కెమెరాలతో నిఘా నీడకు వచ్చింది.

మునిరత్నకు దక్కని ఊరట

బెంగళూరు (మల్లేశ్వరం): అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్న బెయిలు అర్జీ విచారణ ఎనిమిదో తేదీకి వాయిదా పడింది. మునిరత్న తరపు న్యాయవాది వాదనలను 42వ ఏసీఎంఎం న్యాయస్థానంలో న్యాయమూర్తి సంతోశ్ గజాననభట్ ఆలకించి, విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు అత్యాచారం, హనీ ట్రాప్ జరిగిన ప్రదేశాల్లో సిట్ అధికారులు శుక్రవారం కూడా మహజరు నిర్వహించారు. మునిరత్నకు డీఎన్ఏ పరీక్షలు చేయించేందుకు న్యాయస్థానం సిట్‌కు అనుమతి మంజూరు చేసింది. రక్తం నమూనా ఇచ్చేందుకు సమ్మతమేనని న్యాయవాది చెప్పారు.

వెయ్యిమందికి అస్వస్థత

ఉడుపి: కలుషిత నీరు తాగి బైందూరు తాలూకా ఉప్పుంద గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించి బైందూరు, కర్కిహళ్లి, ఉడుపి, కుందాపురల్లోని ఆసుపత్రులకు తరలించారు. ట్యాంకు నుంచి సరఫరా అయిన నీరు కలుషితమైందని గుర్తించారు.

'ఆ భూమిని కొనుగోలు చేశా'



అశోక్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: లొట్టగొల్లహళ్లి వద్ద తాను డబ్బు చెల్లించి కొనుగోలు చేసుకున్న భూమిని కూడా వివాదంలోకి లాగేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని విపక్ష నేత అశోక్ ఆరోపించారు. తాను ఏ భూమినీ డీనోటిఫికేషన్ చేయించలేదని, 'పసుపు-కుంకుమ' కింద ఎవరూ భూమి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇదే విషయమై గతంలోనూ ఫిర్యాదులు వచ్చాయని, తాను ఎలాంటి తప్పు చేయలేదని అప్పటి గవర్నర్ క్లీన్ చిట్ ఇచ్చారని గుర్తు చేశారు. సిద్ధరామయ్య, ఇతర మంత్రులపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానమూ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన ఘటనను మళ్లీ ఉద్దేశపూర్వకంగా అధికార పార్టీ లేవనెత్తుతోందని దుయ్యబట్టారు.

ఇప్పుడు విజయ్ టాటా వంతు



విలేకరులతో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: గత నెల వరకు జనతాదళ్‌లో క్రియాశీలకంగా ఉన్న భూవ్యాపారి విజయ్ టాటాపై మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ అమృతహళ్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. విజయ్ టాటా తనను రూ.100 కోట్లు ఇవ్వాలని ఒత్తిడి చేశారని, తన వద్ద నగదు లేదని చెప్పడంతోనే ప్రత్యారోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.50 కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, రూ.5 కోట్లు ఇవ్వాలని రమేశ్ గౌడ తనను బెదిరించారని విజయ్ టాటా ఇప్పటికే అమృతహళ్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా రమేశ్‌గౌడను ఏ1గా, కుమారస్వామిని ఏ2గా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇరు ఫిర్యాదులను పోలీసులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారని నగర పోలీసు కమిషనర్ బీ దయానంద్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. కుమారస్వామి, రమేశ్‌గౌడ నగదు డిమాండ్ చేసినట్లు ఆధారాలు ఉంటే తీసుకురావాలని విజయ్ టాటాకు పోలీసులు సూచించారు.

సండూరులో భాజపా జెండా ఎగిరేనా!


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, చిత్రంలో దివాకర్, హనుమంతు తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ కంచుకోట సండూరు నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో

గాలి జనార్దరెడ్డి సుడిగాలి పర్యటన

భాజపా పతాకాన్ని ఎగురవేయడానికి ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. అక్రమ గనుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారి జిల్లాకు 14 ఏళ్లుగా దూరంగా ఉన్నారు. ఐదురోజుల ముందు సర్వోన్నత న్యాయ స్థానం జిల్లాకు వెళ్లడానికి అవకాశం కల్పించడంతో గురువారం సాయంత్రం నగరానికి గాలి జనార్దన్‌రెడ్డి చేరుకున్నారు. మరసటిరోజు శుక్రవారం తన మద్దతుదారులతో సండూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఇక్కడ ఉపఎన్నిక గెలుపు పార్టీ కంటే జనార్దన్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మకంగా మారింది. భాజపా అభ్యర్థిని గెలిపించుకొని జిల్లాలో తన సత్తా చూపాలని ఆయన ఆరాటపడుతున్నారు. తొలుత గాలి జనార్దనరెడ్డి విరక్తిమఠంలో ప్రభు స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. తదుపరి విజయ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓసారి భాజపా అభ్యర్థిని ఆశీర్వదించండని, ఉప ఎన్నికలో ఇంటింటికి తిరుగుతానని ప్రకటించారు. అక్కడి నుంచి కుమారస్వామి దర్శనం చేసుకుని కూడ్లిగి తాలూకాలో పర్యటించారు. ఆయన వెంట మాజీ మంత్రి శ్రీరాములు, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, సోమలింగప్ప, పార్టీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తదితరులు కనిపించలేదు. మరి గాలి ప్రభావం సండూరు క్షేత్ర ఉప ఎన్నికల్లో చూపుతోందో? లేదో? వేచి చూడాల్సిందే.

ఐపీఎస్ అధికారి సస్పెన్షన్‌కు డిమాండ్


గడగిచన్నప్ప కూడలిలో జేడీఎస్ నాయకులు తాయణ్ణ, వండ్రి తదితరుల నిరసన

బళ్లారి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేయాలంటూ జేడీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నగరంలో ఆందోళన నిర్వహించారు. తమ డిమాండుతో కూడిన వినతిపత్రాన్ని జిల్లాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామిపై అసభ్య పదజాలంతో కూడిన పత్రాన్ని సామాజిక మాధ్యమంలో వైరల్ చేసిన చంద్రశేఖర్‌ను వెంటనే పోలీసు శాఖ నుంచి తొలగించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో నాయకులు వండ్రి, బసవ, రాము, అశోక్, జమీలా, కిరణ్, రేష్మా, నాగవేణి తదితరులున్నారు.

బాలిక కేసులో వీడని చిక్కుముడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: తిలక్‌నగరలో రెండు నెలల క్రితం అనుమానాస్పదంగా మరణించిన గగ్గి మురళీధర్ (13) అనే బాలిక కేసు విచారణ పోలీసులకు కొరకరాని కొయ్యగా మారింది. మురళీధర్, శ్రుతి దంపతులకు గగ్గి ఒక్కర్తే కుమార్తె. జయనగరలోని ఉషా అపార్ట్‌మెంట్‌లో వీరు ఉండేవారు. మే 22 సాయంత్రం ఏడు గంటలకు తన పిన్నితో కలిసి గగ్గి బయటకు వెళ్లింది. అరగంటలోనే వారిద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు. తదుపరి రోజు పడకపై బాలిక పడకపై మూత్ర విసర్జన చేసుకుంది. అస్వస్థతగా ఉన్న తమ కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా ఆమె మరణించిందని వైద్యులు తెలిపారు. అనుమానాస్పదంగా మరణించిందని కేసు నమోదు చేసుకున్నారు. మరణోత్తర పరీక్ష నివేదికలో ఆమె ఊపిరి ఆడక మరణించిందని నివేదిక రావడంతో దాన్ని హత్య కేసుగా నమోదు చేసుకున్నారు. ఆమెకు ఊపిరి ఆడకుండా హత్య చేసిన హంతకుడు ఎవరని గుర్తించే దిశలో పోలీసులు గత రెండు నెలలుగా గాలిపు చేస్తూ వస్తున్నా, ఇప్పటి వరకు పోలీసులకు నిందితుడు దొరకలేదు.

స్టేషన్ పేరు మార్పు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: చిక్కపేట ట్రాఫిక్ ఠాణా పేరును చామరాజపేట ట్రాఫిక్ ఠాణాగా ప్రభుత్వం పేరు మార్చింది. చిక్కపేట ట్రాఫిక్ ఠాణా పరిధిలోని అన్ని ఫలకాల పేర్లను మార్చుతున్నామని పశ్చిమ విభాగం ట్రాఫిక్ డీసీపీ అనిత హద్దణ్ణనవర్ తెలిపారు. ఇకపై ప్రజలు చామరాజపేట ట్రాఫిక్ ఠాణా పేరిటే ఉత్తర ప్రత్యుత్తరాలు చేయవలసి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

రిజర్వేషన్లను మార్చలేదు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. శుక్రవారం ఇక్కడ కాంగ్రెస్‌భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నేతలు మాజీ మంత్రి హెచ్.ఎం. రేవణ్ణ, ఎమ్మెల్సీ నాగరాజు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పీఆర్ రమేష్ తదితరులు మాట్లాడారు. పీడిత వర్గాలకు చెందిన రిజర్వేషన్లను తగ్గించి వాటిని ముస్లింలకు ఇస్తున్నారని హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తొలి నుంచి పీడిత వర్గాలకు ఉన్న రిజర్వేషన్లను రద్దు చేయాలని భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించారని, అదే ఓబీసీ విషయంలో ఎందుకు భాజపా నేతలకు శ్రద్ధ ఉండదని ప్రశ్నించారు.

నిలిచిన కార్యాచరణ

కార్వార, న్యూస్‌టుడే: అంకోలా తాలూకా శిరూరు వద్ద కొండచరియలు విరిగిపడిన చోట గంగావళి నదిలో మృతదేహాలను గాలించేందుకు 13 రోజులుగా కొనసాగుతున్న కార్యాచరణను గురువారం సాయంత్రం నిలిపివేశారు. అర్జున్ మృతదేహం లభించడం, ఇద్దరు ఎముకలు లభించడంతో డ్రెజ్జింగ్‌తో కార్యాచరణను నిలిపి వేశామని అధికారులు తెలిపారు. హోటల్ కూలిన చోటు నుంచి నదిలో కొంత దూరం వరకు ఈత నిపుణులతో కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు. ఎముకలకు సంబంధించి డీఎన్ఏ నివేదిక వస్తే అవి ఎవరివో గుర్తించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు.

‘బదిలీలు కోరుతూ కార్యాలయానికి రావద్దు’


కవాతు చేస్తున్న సిబ్బంది

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: బదిలీలు కోరుతూ తన కార్యాలయానికి రావద్దని నగర పోలీసు కమిషనర్ బి.దయానంద్ సిబ్బందిని కోరారు. సిఫార్సు పత్రాలు తీసుకుని, తన కార్యాలయానికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆడుగోడి సీఏఆర్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన వార్షిక కవాతులో సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని అందుకున్నారు. మరో మూడు నెలల్లో ఏడాది పూర్తవుతుందని, ఆ సమయంలో నగరంలో కట్టుదిట్టమైన భద్రత అవసరం అవుతుందన్నారు. ఈ సమయంలో బదిలీలు కోరవద్దని సూచించారు. అత్యవసరంగా బదిలీ అవసరమైతే డీసీపీలను సంప్రదించాలన్నారు. కొన్ని ఠాణాల్లో తమకు టీఏ, డీఏ అందడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని కేసులను ఇప్పటి సిబ్బంది ఉత్తమరీతిలో దర్యాప్తు చేసి పరిష్కరిస్తున్నారని అభినందించారు. నేరాలను నియంత్రించేందుకు క్రమం తప్పకుండా ప్రజలు, యువతకు జాగృతి కల్పించాలని పిలుపునిచ్చారు. దసరా, దీపావళి, క్రిస్మస్ సమయాల్లో భద్రతకు పెద్దపీట వేయాలని సూచనలు చేశారు.

వైభవంగా సింధనూరు దసరా ఉత్సవం


ప్రధాన కూడలిలో శక్తి దేవత అంబాదేవికి పూజలు


బెంగాలి కాందీశికుల సంప్రదాయ నృత్యం

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా అంటే ఒక్క మైసూరులోనే కాదు రాష్ట్రమంతటా.. ఇక నుంచి అన్ని తాలూకాల్లో జరుగుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం సింధనూరు సభలో ప్రకటించారు. ఆయన మాటలకు తగ్గట్టే సింధనూరు దసరా అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా మేళతాళాల నడుమ ఊరేగింపులో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరైన జనాన్ని చూసి విస్తుపోయారు. ఇక్కడ కులమత బేధాలు లేకుండా దసరాను ఆచరించడం చూస్తుంటే ఆనందం కలుగుతుందన్నారు. గాంధీ కూడలి నుంచి ఆయనను డిగ్రీ కళాశాల మైదానం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడవునా కళా బృందాలు తమ నృత్యాలతో అలరించాయి. కొద్దిసేపు వరుణుడు తన ఆర్భాటం చూపినా కొద్దిసేపటికే కనుమరుగయ్యాడు. దాదాపు రెండు గంటల పాటు పుర వీధుల్లో దసరా ఆరంభ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. శనివారం రెండో రోజు దసరా ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలు ఆర్జీఎం మైదానంలో జరుగుతాయని నిర్వాహకులు ప్రకటించారు.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఘన స్వాగతం



శ్రీరామనగర్‌లో సీఎంకు పార్టీ శ్రేణుల స్వాగతం

గంగావతి, న్యూస్‌టుడే: రాయచూరు జిల్లా పర్యటనకు వెళుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అభిమానులు గంగావతిలో ఘన స్వాగతం పలికారు. గిణిగెరా విమానాశ్రయం నుంచి ఆయన గంగావతి మీదుగా సింధనూరుకు వెళ్లారు. క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ కూడలిలో వేలాది కార్యకర్తలు చేరుకున్నారు. వారికి సీఎం అభివాదం చేశారు. జంగమర కల్గుడి, శ్రీరామనగర్, కారటగిలోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఆయన కోసం వేచిచూడటం కనిపించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలని మాదిగలు గంగావతిలో ఆయనకు విజ్ఞప్తి చేశారు.

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: సింధనూరు పర్యటనకు వెళ్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు శివరాజ్ తంగడిగి, శరణ ప్రకాష్‌పాటిల్‌కు శుక్రవారం సాయంత్రం శ్రీరామనగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆ పార్టీ జిల్లా నాయకులు మన్నె కృష్ణమూర్తి, రెడ్డి వీర్రాజు, పి.రామకృష్ణ, మహ్మద్ రఫీ, వరద రాజ సీఎంకు గౌరవపూర్వకంగా బొకే అందజేశారు. కొప్పళ జిల్లా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తమను ఆయన ప్రేమ పూర్వకంగా పలకరించారని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సంప్రదాయాల దర్పణం.. సంస్కృతి సజీవం

యునెస్కో జాబితాలోకి జానపద, గిరిజన లోక



గిరిజన లోక ప్రవేశ ద్వారం


చలి కాచుకుంటున్న గిరిజనులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రామనగర కర్ణాటక జానపదలోక ఆవరణలో బుడకట్టు గిరిజన లోక యునెస్కో జాబితాలో చేరనుంది. ఈ మేరకు యునెస్కో ప్రతినిధులు జానపద, గిరిజన లోకలను సందర్శించి వివరాలు సేకరించారు. ప్రాచీన జానపద ఆదివాసీ సంస్కృతులు, కళలు ఆచార సంప్రదాయాలను సేకరించి జానపద, గిరిజన లోకల్లో ఉంచారు. మరోవైపు మైసూరు సందర్శించే పర్యాటకులకు మరో పర్యాటక కేంద్రంగా మారింది. జానపద లోకను సందర్శిస్తున్న పర్యాటకులు ఇక నుంచి గిరిజన లోకను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని మూలవాసులైన గిరిపుత్రులు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఆచారాలు తదితర వాటిని ఐదు ఎకరాల విస్తీర్ణంలో గిరిజన లోకను కన్నడ సాంస్కృతిక శాఖ అభివృద్ధి చేసింది. జేనుకురుబరు, గూండరు, కుడియరు, మలెకుడియరు, హాలక్కి ఒక్కలిగరు, గౌళిగర తదితర గిరిజనులు జీవనశైలి, అలవాట్లు, వృత్తులు, వేట, మనోరంజన తదితర వాటిని ప్రాణి పక్షుల శిల్పాలను ఏర్పాటు చేశారు. పడమటి కనుమల్లో నివసించే గిరిజనుల జీవన చిత్రాలతో పాటు గిరిజన పల్లె వాతావరణం కృత్రిమంగా కల్పించారు. శిల్పకళా నిపుణుడు డాక్టర్ టి.బి.సోలబక్క నేతృత్వంలో జీవం ఉట్టిపడేలా గిరిజనుల జీవన శైలిలో బొమ్మలు రూపొందించి అక్కడ ఉంచారు. కాడుగొల్ల దైవజుంజప్పన గుడి నిర్మాణంలో, గిరిజన ఉత్పత్తుల కేంద్రం, గిరిజన శైలిలో క్యాంటీన్ నిర్మాణం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన లోకాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు జానపద లోక అధ్యక్షుడు ఆచార్య హి.శి.రామచంద్రగౌడ తెలిపారు. సోలిగ, సిద్ధి, ఇరుళిగ, కూరగ తదితర జాతుల జీవనశైలి ప్రతిబింబించేలా బొమ్మలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు గిరిజన లోకలో బొమ్మలు, గుడిసెలు తదితర వాటిని ఏర్పాటు చేసి చూపిస్తారు. ఆధునిక సమాజం ప్రభావం గిరిజనులపై పడుతోంది. నిదానంగా గిరిజనుల ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, భాష, వేషధారణ తదితర వాటిల్లో మార్పు చోటు చేసుకుంటుంది. ముందు తరాల వారి కోసం వాటిని కాపాడే ప్రయత్నాలను జానపద లోక చేపట్టింది. అందులో భాగంగా ప్రత్యేకంగా గిరిజన లోకను ఏర్పాటు చేసింది. గిరిజనలోక లోకి ప్రవేశిస్తే అటవీ ప్రదేశంలోకి అడుగు పెట్టిన అనుభూతి కలుగుతుందని ఆచార్య రామచంద్రగౌడ తెలిపారు.


విల్లంబులు ధరించిన గిరిజనులు


పల్లెసీమ


గ్రామీణ రచ్చబండ


గిరిజనుల గుడిసె లోపల భాగం

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తున్నాం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: పీఈఎస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యా ప్రమాణాలు అందుతున్నాయని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కౌశల్యాభివృద్ధికి బజాజ్ ఇంజినీరింగ్ కౌశల్య శిక్షణ కేంద్రం (బెస్ట్)ను శుక్రవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. విద్యాభ్యాసంతో పాటే, విద్యార్థులు కౌశల్యాన్ని వృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోనూ ఈ తరహా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు విద్యాసంస్థలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇరు సంస్థల ప్రతినిధులు ఆచార్య దొరెస్వామి, ఆచార్య జవహర్, రవికిరణ్ రామస్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వేదికపై డాక్టర్ సుధాకర్, ఆచార్య దొరెస్వామి, జవహర్, రామస్వామి తదితరులు

వాయుసేనలో వైద్య శిక్షణ పూర్తి


కవాతు చేస్తున్న అభ్యర్థులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: భారతీయ వాయుసేనలో వైద్య సహాయకులుగా శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది అభ్యర్థుల నుంచి ఎయిర్ వైస్ మార్షల్ రేణుకా కుంటె గౌరవ వందనం అందుకున్నారు. శిక్షణ సమయంలో ఉత్తమ ప్రతిభ చూపిన అంకిత్ దూడీ, అరుణ్ కుమార్, గిరికరణ్ ఆర్, జిష్ణు వివిధ విభాగాల్లో ట్రోఫీలు, ఫలకాలను అందుకున్నారు. చికిత్సలకు వచ్చే రోగులకు అంకితభావంతో సేవలు అందించాలని ఆమె పిలుపునిచ్చారు.

భాజపాపై మంత్రి భార్య ఫిర్యాదు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: భాజపా నాయకులు మత సామరస్యాన్ని దెబ్బతీసేలా, తనను, తన కుటుంబాన్ని అవహేళన చేస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు భార్య టబురావు ఆరోపించారు. తనపై ఆరోపణలు చేసిన మాజీ మంత్రులు, భాజపా నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్ణాటక మహిళా కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరికి ఫిర్యాదు చేశారు.

అర్హులకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు


శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేంద్ర, చిత్రంలో హాస్య నటుడు దొడ్డణ్ణ తదితరులు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: కంటిచూపు సమస్యతో బాధపడే వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడంతో పాటు వారికి మందులు, కళ్లద్దాలు ఇస్తామని ఎమ్మెల్యే వీరేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం చెళ్లకెర తాలూకాలోని లక్ష్మీసాగర గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో చిత్రదుర్గం జిల్లాలో కంటి సమస్యలతో బాధపడే అర్హులైన వారికి శస్త్రచికిత్సలు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర హాస్య నటుడు దొడ్డణ్ణ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి విచ్చేసిన 280 మందిని వైద్యులు పరిశీలించి 98 మందికి చూపు సమస్యలున్నట్లు గుర్తించారు. 51 మందికి కంటిపొర చికిత్సకు ఏర్పాట్లు చేయనున్నట్లు డాక్టర్ రవీంద్ర తెలిపారు.

నీటికుంటలో పడి యువకుడి మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: గొర్రెలను కాయడానికి వెళ్లిన కొట్రేశ్ (28) అనే యువకుడు ప్రమాదవశాత్తు వ్యవసాయ నీటికుంటలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం కూడ్లిగి తాలూకా ఎం.బి.అయ్యనహళ్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ ప్రాంతానికి చెందిన గొర్రెల యజమాని దొడ్డప్ప కుమారుడు కొట్రేశ్ గొర్రెలను కాసేందుకు వెళ్లిన సందర్భంగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కొందరు స్థానికులు కొట్రేశ్‌ను నీటికుంట నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. ఘటనపై హొసహళ్లి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాలిక విషాదంతం

హొసపేటె: ఇంటి ముంగిట్లో ఆడుకుంటున్న బాలిక మేఘన(3) చీకటిలో నీటితొట్టెలో పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి కూడ్లిగి తాలూకా మొరబనహళ్లి గొల్లరహట్టిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాలూకాలోని తుప్పక్కనహళ్లికి చెందిన సిద్ధప్ప భార్య ప్రసవం కోసం పుట్టినిల్లయిన మొరబనహళ్లి గొల్లరహట్టికి వెళ్లింది. ఆమె మూడేళ్ల కుమార్తె మేఘన అమ్మ వెంట ఉంది. ఈ నేపథ్యంలో ఆడుకుంటున్న బాలిక ఇంటి పక్కనే పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలో పడింది. బాలికను కూడ్లిగి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి దుర్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: మోటారుతో నీటిని నింపుతున్న గంగమ్మ(65) అనే వృద్ధురాలు విద్యుదాఘాతానికి గురై చనిపోయిన ఘటన కొట్టూరు తాలూకా మంగాపురలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగాపురలో శుక్రవారం గంగమ్మ మోటారుతో నీరు నింపుతుండగా దానికున్న వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉజ్జిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు హొసహళ్లి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆటో చోదకుడు.. చివరికి చిక్కాడు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఎక్కువ బాడుగ ఇచ్చేందుకు నిరాకరించిన ఒక యువతిని దూషించిన ఆటో డ్రైవరు సంతోష్ (26)ను మైకో లేఅవుట్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సిల్క్ బోర్డు వెళ్లేందుకు వేచి ఉన్న ఆమె వద్దకు ఆటో డ్రైవరు వచ్చాడు. రూ.300 ఇవ్వాలని డ్రైవరు కోరగా, ఆమె రూ.150 ఇస్తానని చెప్పింది. ఒక్కసారిగా కోపం పెంచుకున్న నిందితుడు ఆ యువతిని అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె ఆ మాటలను చరవాణిలో రికార్డు చేసుకుని పోలీసుల ఎక్స్ కార్ప్ ఖాతాలో పోస్టు చేసింది. స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు పూర్తి చేశారు. నిందితుడు బిలేకహళ్లికి చెందినవాడని పోలీసులు తెలిపారు.


భోగప్రద అలంకారంలో బనశంకరి దేవస్థానంలో కొలువైన శాకంబరి అమ్మవారు


వర్ణభరిత నిండు గాజులు ధరించిన తొలి ముత్తైదు శ్రీబనశంకరి మాత


మహేశ్వరి అలంకారంలో పార్వతీదేవి


కుంకుమ పుష్పఅలంకారాలలో అంబాభవానీ

గాంభీర్యమూర్తి..నమోనమః

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల రెండోరోజైన శుక్రవారం అమ్మవార్లు శుక్రవారపు శుభ ముత్తైదువులుగా సుందర అలంకరణలలో దర్శనమిచ్చారు. ప్రముఖ బనశంకరిమాత దేవస్థానంలో బనశంకరీదేవి వర్ణభరిత గాజులను సింగారించుకుని మహిళలకు కనువిందు కలిగించింది. ఇదే దేవస్థానంలో కొలువైన శాకంబరీదేవి భోగప్రదగా భక్తులను సంతోషపరుస్తూ వరాల జల్లులు కురిపించింది. బలమురిశేష మహాగణపతి దేవస్థానంలో పార్వతీదేవి మహేశ్వరిగా అవతారమెత్తి కొబ్బరి ఈనెలతో రూపొందించిన సుందర ఆసనం అలంకార మధ్య కొలువై చిరునవ్వులు ఒలికించింది. కెంపే గౌడనగర్‌లో విరాజిల్లిన అంబాభవానీ మాత పట్టువస్త్రాలు కట్టి పసుపు కుంకుమలను నుదుటన అద్దుకుని, త్రిశూలం ధరించి గాంభీర్య మూర్తిగా ఒసగిన దర్శనం తిలకించి భక్తులు మురిసిపోయారు. హారనాడులో ఆదిశక్త్యాత్మక అన్నపూర్ణేశ్వరిదేవి రెండోరోజు బ్రహ్మచారిణి అవతారమెత్తి (బ్రాహ్మణి) జ్ఞానబోధ చేయటం విశేషం.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

పాఠశాలకు రూ.లక్షన్నర సామగ్రి విరాళం



శ్రీరామనగర్ తాలూకాలోని కంటోజీ లక్ష్మీక్యాంపు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బెంగళూరు అమృత ఫౌండేషన్ రూ.లక్షన్నర విలువచేసే సామగ్రిని విరాళంగా ఇచ్చింది. డెస్కులు, టేబుళ్లు, నలి-కలి రౌండ్ టేబుల్, కుర్చీలు, క్రీడా పరికరాలు, విద్యార్థులకు సంచులు, రాతపుస్తకాలు, కంపాస్ సమకూర్చారని ప్రధానోపాధ్యాయుడు సోము కుదరిహళ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు హేమంత్ కుమార్, మేనేజర్ రవి కుమార్, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు రామచంద్ర, ఉపాధ్యక్షురాలు దురుగమ్మ, క్యాంపు వాసులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కంటోజీ లక్ష్మీక్యాంపు (శ్రీరామనగర్)

బెన్నూరు జీపీ అధ్యక్షుడిగా బసప్ప



కారటగి తాలూకాలోని బెన్నూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా బసప్ప కాలిగనూరు శుక్రవారం ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి ఆయన ఒక్కరే నామపత్రాలు సమర్పించడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దారు ఎం.కుమారస్వామి ప్రకటించారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న శరణప్ప సాహుకార రాజీనామాతో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది. జీపీ సభ్యులు, అధికారులు తదితరులు కొత్త అధ్యక్షుడిని అభినందించారు. -న్యూస్‌టుడే, కారటగి



యశవంతరాజ్ బాధ్యతలు స్వీకరణలో మహారుద్రగౌడ, సురేష్‌బాబు, దొడ్డనగౌడ, మంజునాథ, పాలన్న తదితరులు

బీడీసీసీఐ అధ్యక్షుడిగా యశవంతరాజ్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల సంస్థ (బీడీసీసీఐ) అధ్యక్షుడిగా యశవంతరాజ్ నాగిరెడ్డి శుక్రవారం ఉదయం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ సంస్థ పూర్వ అధ్యక్షుడు మహారుద్రగౌడ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. గౌరవ కార్యదర్శిగా కె.సి.సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా అవ్వారు మంజునాథ్, ఎస్.దొడ్డనగౌడ, గిరిధర సొంత, సహాయ కార్యదర్శులుగా మర్చేడ్ మల్లికార్జునగౌడ, వి.రామచంద్ర, కోశాధికారిగా పి.పాలన్న కొనసాగుతున్నట్లు కొత్త అధ్యక్షుడు ప్రకటించారు. మహారుద్రగౌడ, ఇతర సభ్యులు బీడీసీసీఐ అభివృద్ధికి శ్రమించారన్నారు. వారి మార్గదర్శనంలో సంస్థ అభివృద్ధితో పాటు వ్యాపారుల సమస్యలు పరిష్కరించడానికి శ్రమిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సంస్థ మాజీ అధ్యక్షుడు మహారుద్రగౌడ, సి.శ్రీనివాసరావ్, సభ్యులు నాగళ్లి రమేష్, టి.శ్రీనివాసరావ్, ఎస్.సత్యనారాయణ, జె.రాజేశ్, నాగరాజ్, టి.శ్రీనివాసరావ్, పి.గిరీశ్, జేతం ప్రభుదేవ్, సత్యబాబు, గోవిందరెడ్డి, సి.ఎ రాజశేఖర్, వి.వెంకటేశులు, రాజేకుమార్, వెంకటేశ్, దీపక్, ఆర్.నాగరాజ్, వేణుగోపాల్ గుప్త, రామచంద్రారెడ్డి, నాగరాజ్, గోపాలరెడ్డిలు కార్యకారి సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

మాంసపు వ్యర్థాలు పడేస్తే చర్యలు

హొసపేటె, న్యూస్‌టుడే: మాంస విక్రయ దుకాణదారులు వ్యర్థాలను రోడ్డుపై పడేస్తే చర్యలు తప్పవని నగరసభ కమిషనర్ సి.చంద్రప్ప హెచ్చరించారు. పట్టణంలోని మాంస విక్రయ దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో వీధి కుక్కల నియంత్రణ చేపట్టాల్సిన చర్యలపై దుకాణదారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పట్టణంలో సుమారు 4 వేల వీధి కుక్కలున్నట్లు పశువైద్య శాఖ గణాంకాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే సగం కుక్కలకు క.ని. శస్త్రచికిత్సలు చేయించామని, రాబోయే రోజుల్లో మరిన్ని గట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు. మాంసపు వ్యర్థాలను వీధుల్లో పడేస్తుండటంతో కుక్కలు పెద్ద సంఖ్యలో గుమిగూడుతున్నట్లు తెలుస్తోందన్నారు. వీధి కుక్కల దాడిలో చాలామంది గాయపడ్డారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. వ్యర్థాలు నిల్వ చేసుకుని దుకాణం మూసిన తర్వాత గోతిలో పూడ్చి పెట్టాలని స్పష్టం చేశారు. మాంసాన్ని గాజు పెట్టెలో ఉంచాలని సూచించారు. నగరసభ అధ్యక్షుడు రూపేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గుప్తా, చిత్తవాడ్గీ ప్రముఖుడు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుకాణదారులకు సూచనలు చేస్తున్న నగరసభ కమిషనర్ చంద్రప్ప



బళ్లారి: కృష్ణానగర్ క్యాంపులో గాయత్రిదేవిగా అమ్మవారు



హొసపేటె: ప్రత్యేకాలంకారంలో హులిగెమ్మ తల్లి



గంగావతి: బాపిరెడ్డి క్యాంప్‌లో..



సిరుగుప్పలో గాయత్రిదేవిగా..



సిరుగుప్ప తాయమ్మదేవి ఆలయంలో..



కారటగి: రత్నగిరిపై గాయత్రిదేవిగా..



శ్రీరామనగర్: ప్రత్యేకాలంకారంలో కనకదుర్గాదేవి



బళ్లారి గ్రామీణ: గాజులమ్మగా కౌల్‌బజార్ పెద్దమ్మతల్లి



బళ్లారి గ్రామీణ: కనక దుర్గమ్మకు రజత కవచం

దివ్యరూపిణి.. వరప్రదాయిని



బళ్లారి: విద్యుద్దీపకాంతుల్లో కనకదుర్గమ్మ ఆలయం

బళ్లారి, న్యూస్‌టుడే: శరన్నవ రాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. నగరంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయం విద్యుద్దీపాల కాంతుల్లో తళుకులీనింది. కృష్ణానగర క్యాంపులోని దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు గాయత్రిదేవిగా, కురుగోడు పట్టణంలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు దేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు.

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: శరన్నవ రాత్రుల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి అష్టోత్తరం, లలిత సహస్ర నామ పఠనం చేశారు. పెద్దమార్కెట్ నీలకంఠేశ్వరిని గాయత్రీదేవిగా, కనకదుర్గమ్మ, బోయవీధి మారెమ్మలను రజత కవచాలతో అలంకరించారు. కౌల్‌బాజర్ పెద్దమ్మతల్లిని గాజులతో, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజించారు. మల్నాడు దుర్గమ్మ, చిన్నదుర్గమ్మ, భవానీమాత, తాయమ్మ, ఏళుమక్కళతాయి, సంతోషిమాతల ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

హొసపేటె: తుంగభద్ర నదీ తీరంలోని ధార్మిక క్షేత్రం హులిగిలో హులిగెమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే దర్శనానికి భక్తులు క్యూకట్టారు. తాలూకాలోని హొసూరమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. హొసపేటె పట్టణం రాణిపేట్‌లో ముద్లాపుర తాయమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయం ప్రవేశద్వారాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

గంగావతి: పట్టణంలోని శంకర మఠంలో శారదాదేవికి కోటి కుంకుమార్చన చేశారు. శారదాశంకర, భగిని, గంగాధరేశ్వర భజన మండళ్ల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. ధర్మకర్త నారాయణరావ్ వైద్య మాట్లాడుతూ ఏడో సంవత్సరం శరన్నవ రాత్రులు పురస్కరించుకుని కోటి కుంకుమార్చన చేపట్టినట్లు చెప్పారు. అర్చకులు కుమారభట్ ధార్మిక కార్యాలను నెరవేర్చారు. బాపిరెడ్డి క్యాంపులోనూ అమ్మవారికి విశేష అలంకారం చేశారు.

సిరుగుప్ప: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సకల దేవతలకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీదేవి, అన్నపూర్ణేశ్వరి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. పట్టణ శివారు ఆదోని రహదారిలోని అంబాభవానీ ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి గాయత్రీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తాయమ్మదేవి గుడిలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీనగర్ క్యాంపులోని పట్టాభిరామ ఆలయంలో అమ్మవారికి వేద పండితులు పూజలు చేసి బాలాత్రిపురసుందరిగా అలంకారం చేశారు.

దేవీక్యాంపు (కారటగి): దేవీ క్యాంపు రత్నగిరిపై రెండో రోజు శుక్రవారం శ్రీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మచారిణి పూజ, వారాహి హోమం తదితర ధార్మిక కార్యక్రమాలు సాగాయి. ఉదయం కొండ కింది నుంచి పైకి మెట్లోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది.

శ్రీరామనగర్: శ్రీరామనగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, ఆరో వార్డులోని సంతోషిమాతకు విశేష పూజలు నిర్వహించారు.

మాన్వి: మాన్వి, సిరివార తాలూకాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కల్మల పరిధి మారెమ్మ క్యాంపులోని ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

చెళ్లకెర (చిత్రదుర్గం): చెళ్లకెర పట్టణంలోని ఇళ్లలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. చెళ్లకెరమ్మ, వీరభద్ర స్వామి, వాసవీమాత, బనశంకరి, ఉత్సవాంబ, దత్తమందిరం తదితర ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగం కల్పించారు.



గంగావతి: శారదాదేవికి మహిళా భక్తుల కుంకుమార్చన



బళ్లారిగ్రామీణ: లక్ష్మీదేవిగా శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి




మాన్వి: మారెమ్మ క్యాంపులో గాయత్రీదేవిగా.. కారం



చెళ్లకెర: ఉత్సవాంబ ఆలయంలో అమ్మవారు



చెళ్లకెర: ఆకట్టుకున్న బొమ్మల కొలువు



హొసపేటె: ముద్లాపుర తాయమ్మ ఆలయ ప్రవేశద్వారం



బళ్లారి గ్రామీణ: ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ముఖ్యమంత్రి రాకకు మాన్వి ముస్తాబు

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు సర్వ సిద్ధమైంది. ఐదారు రోజులుగా పార్టీ నాయకులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పర్యవేక్షణలో యువ కాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజు ముందుండి వేదిక నిర్మాణం పనులు చేయిస్తున్నారు. స్థానిక సూర్యఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో వేదికను సిద్ధం చేశారు. 50 వేల మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య వేదికపై 50 నుంచి 60 మంది నాయకులు, ప్రముఖులు కూర్చోవడానికి ఎత్తుగా వేదిక నిర్మించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి మాన్వి ఎక్స్‌ప్రెస్ బస్టాండ్, నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, వివిధ వసతి నిలయాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సీఎంతో బాటు ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, మంత్రులు ఎన్.ఎస్.బోసురాజు, శరణప్రకాష్‌పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప, మునియప్ప, శివరాజ్ తంగడిగి, రహీంఖాన్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొంటున్నారు.



వేదిక పనులు పర్యవేక్షిస్తున్న రవిబోసురాజు, ఈరణ్ణ తదితరులు



చురుగ్గా సాగుతున్న సీఎం సభా వేదిక నిర్మాణం

ఆటలో గెలుపోటములు సహజం

బళ్లారి, న్యూస్‌టుడే: చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జయాపజయాలను సమానంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. బెళగావి విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం, కలబురగి విభాగం ఖోఖో పోటీలు శుక్రవారం రావ్ బహద్దూర్ వై.మహబలేశ్వరప్ప సాంకేతిక కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. కళాశాల అధ్యక్షుడు జానెకుంటె బసవరాజ, ప్రధానాచార్యులు డా.హనుమంతరెడ్డి, ఆచార్యులు ఎస్.కోట్రేశ, చంద్రశేఖర్, వ్యాయామ అధ్యాపకుడు విజయ మహంతేశ్ పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు నాలుగు గోడల మధ్య చదవడమే కాకుండా బహిరంగ మైదానాల్లో ఆటలూ ఆడాలన్నారు. ఇక్కడ గెలిచిన జట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి బళ్లారికి కీర్తిప్రతిష్ఠలు తేవాలని కోరారు. రెండు రోజుల పాటు సాగనున్న పోటీల్లో బళ్లారి ఆర్‌ఎంఈసీ, బీఐటీఎం హొసపేటె, బీదర్, బాగలకోటె, విజయపుర జిల్లాల నుంచి ఆరు జట్లు తలపడుతున్నాయి. మొదటి రోజు లీగ్ పోటీలు జరిగాయి. శనివారం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించనున్నారు. పోటీలను ఆచార్యులు సునిత, బాలకృష్ణ, టైగర్ బాబు, నాగేశ్ తదితరులు పర్యవేక్షించారు.



పోటీలకు హాజరైన బసవరాజు, హనుమంతరెడ్డి, విజయ మహంతేశ్ తదితరులు



తలపడుతున్న బీఐటీఎం, బాగలకోటె జట్లు

మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

గంగావతి, న్యూస్‌టుడే: మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీపై కొప్పళలో శుక్రవారం జరిగిన మాసిక సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది 2 వేలమంది మత్స్యకారులకు కార్డులు పంపిణీ చేయాలన్న లక్ష్యం కలిగి ఉన్నట్లు మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ కులకర్ణి తెలిపారు. గతేడాది 700 మందికి కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బ్యాంకులు సహకరించాలని కోరారు. దీనిపై ప్రచార అభియాన్ చేపట్టనున్నట్లు చెప్పారు. కొప్పళ లీడ్ బ్యాంకు మేనేజర్ వీరేంద్రకుమార్, ఉప సంచాలకులు బసవరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉప విభాగం-2లో విద్యుత్తు స్తంభాల స్థలాంతర పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి తెలిపారు. దీని పరిధిలోకి వచ్చే రామనగర, నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయం, బ్యాంకు కాలనీ, శాస్త్రినగర, పార్వతినగర, మహనంది కొట్టం తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

9 నుంచి లోకాయుక్త విజ్ఞప్తుల స్వీకరణ

బళ్లారి : బళ్లారి లోకాయుక్త పోలీస్ అధికారి నేతృత్వంలో తాలూకాల వారీగా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమం 9వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఎస్పీ సిద్ధరాజు తెలిపారు. 9న బళ్లారి తహసీల్దార్ కార్యాలయం, 15న సిరుగుప్ప సీడీపీఓ కార్యాలయం, 19న కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ప్రజల నుంచి వివిధ సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు ఆయన చెప్పారు.

సమస్యల పరిష్కారానికి వినతి

సిరుగుప్ప: తమ సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు కల్పించాలని అక్షరదాసోహ కార్మికుల ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సంఘం ఆధ్వర్యంలో తాలూకా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ప్రతినిధులు లక్ష్మి, గీత తదితరులు మాట్లాడారు. మధ్యాహ్న భోజన తయారీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఏప్రిల్, మే నెల జీతాలు ఇవ్వలేదన్నారు. తమకు కేటాయించిన పనికంటే ఎక్కువ పని చేయిస్తున్నారన్నారు. ఇస్కాన్ అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందించడం వల్ల తమ ఉపాధి పోతుందని, ప్రత్యామ్నాయం చూపాలని, ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాలూకా పంచాయతీ మేనేజర్ సుజాతకు అందజేశారు.



సుజాతకు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

గాంధీపై వ్యాస రచన విజేత

గాంధీ జయంతి సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మహాత్ముడిపై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో హంపీ కన్నడ విశ్వవిద్యాలయ విద్యార్థి ప్రవీణ్ నింగప్ప కిత్తూర్ విజేతగా నిలిచాడు. 2న బెంగళూరులో జరిగిన గాంధీ జయంతిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ఆ విద్యార్థి పురస్కారం కింద రూ.30 వేలు నగదు, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాలిని రజనీశ్, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.వి.త్రిలోకచంద్ర, కమిషనర్ హేమంత్ నింబాళ్కర్, చలనచిత్ర అకాడమీ అధ్యక్షుడు సాధుకోకిల తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, హొసపేటె



తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

04-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1617.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,948	3,702
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,187	9,737
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	53.726

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టింది. తాలూకా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆలస్యం కాకుండా అర్హులకు అందజేయాలి. నిబంధనలకు విరుద్ధంగా నడచుకుంటే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జిల్లా పంచాయతీ ముఖ్య యోజనాధికారి వాగేశ్ శివాచార్య అధికారులకు గట్టిగా చెప్పారు. శుక్రవారం కురుగోడు తాలూకా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బళ్లారి, కురుగోడు తాలూకా పంచాయతీ 4వ సామాన్య సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ, ఆరోగ్య, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మహిళా, శిశు కల్యాణ, వివిధ శాఖలకు సంబంధించిన పథకాలకు నిజమైన అర్హులను ఎంపికచేసి అందేలా చూడాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యాశాఖాధికారులు శ్రమించాలన్నారు. సింధిగేరి, సోమసముద్రం గ్రామాల్లో గ్రంథాలయాలు ప్రారంభించాలని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయన్నారు. పరిశీలించి ప్రారంభించాలన్నారు. కోళూరు, కెరెకెరె గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. తాలూకా పంచాయతీ ఈవో నిర్మల తాలూకాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు శివరామరెడ్డి, అనిల్‌కుమార్, దయానంద, సిద్ధలింగ స్వామి, మంజునాథ జవళి, గంగమ్మ, ఉద్యానవన, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, విద్యా, శిక్షణ, సమాజ కల్యాణ, బీసీఎం, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాగేశ్ శివాచార్య, చిత్రంలో నిర్మళ తదితరులు

సభ్యత్వ అభియాన్‌పై సమీక్ష

హొసపేటె, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ అభియాన్‌ను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర బాధ్యుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభియాన్ ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాలో సభ్యత్వ అభియాన్‌కు మంచి స్పందన లభిస్తోందన్నారు. యువత సభ్యత్వ నమోదుకు ఆసక్తి చూపిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. వీలైనంత మంది యువకులకు సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి ఆనంద్‌సింగ్, బళ్లారి ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎంపీ దేవేంద్రప్ప, జిల్లాధ్యక్షుడు చెన్నబసవనగౌడ పాటిల్, మండలాధ్యక్షుడు శంకర్ మేటి తదితరులు పాల్గొన్నారు.

బుడాలో పత్రాల పరిశీలన కొనసాగింపు




బుడా కార్యాలయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికార (బుడా) కార్యాలయంలో రెండో రోజు శుక్రవారం అధికారులు పలు పత్రాలను పరిశీలించారు. 2023 మార్చి 7, జులై 8 తేదీల్లో జరిగిన బుడా సమావేశాల్లో చేసిన తీర్మానాలు, నిబంధనల ఉల్లంఘన జరిగింది. అధ్యక్షుడు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రజలిచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యేలు జీఎన్ గణేష్, నారా భరత్ రెడ్డి ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై నగరాభివృద్ధి మంత్రి ఆదేశాలతో నగరాభివృద్ధి ప్రాధికార, నగర, గ్రామాంతర యోజన కమిషన్ ఆదేశాలతో ధార్వాడ ప్రాదేశిక కమిషన్ నేతృత్వంలో కమిటీ సభ్యులు విజయమహంతేశ, నరేంద్రకుమార, శ్వేత, బి.ఎస్.కాశిమఠ తదితరులు 3న బళ్లారి బుడా కార్యాలయం చేరుకున్నారు. రాత్రి 8 గంటల వరకు సంబంధిత పత్రాలు పరిశీలించారు. శనివారం రోజూ పత్రాలు తనిఖీ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు.

తనిఖీ బృందానికి సహకారం: బుడా కార్యాలయంలో పత్రాల పరిశీలనకు వచ్చిన తనిఖీ బృందానికి సహకరిస్తున్నట్లు కమిషనర్ మయణ్ణ గౌడ తెలిపారు. 2023 మార్చి 7, జులై 8న జరిగిన సమావేశాలు అధ్యక్షుడు జె.ఎస్.ఆంజినేయులు అధ్యక్షతన జరిగింది. నగర, గ్రామీణ క్షేత్రాల ఎమ్మెల్యేలూ బుడాలో సభ్యులే. మరో 19 మంది సభ్యులున్నారు. కోరంతో పలు అభివృద్ధి పనులు, ల్యాండ్ మార్పు, ఏకనివాసం, ఆర్థిక విషయాలు, పరిపాలన తదితర వాటిపై చర్చించి సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశాలకు ఇద్దరు ఎమ్మెల్యేలను ఆహ్వానించినా రాలేదు. నిబంధనల ఉల్లంఘించి పలు పనులకు ఆమోదించినట్లు ప్రజలు ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారుల బృందం గురువారం బుడా కార్యాలయం చేరుకుని పత్రాలు పరిశీలించింది. వారు కోరిన పత్రాలు ఇచ్చామని, నివేదిక సిద్ధమైన తర్వాత ప్రభుత్వానికి పంపుతామని కమిషనర్ మయణ్ణగౌడ న్యూస్‌టుడేకు తెలిపారు.

సంప్రదాయాల దర్పణం.. సంస్కృతి సజీవం

యునెస్కో జాబితాలోకి జానపద, గిరిజన లోక



గిరిజన లోక ప్రవేశ ద్వారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రామనగర కర్ణాటక జానపదలోక ఆవరణలో బుడకట్టు గిరిజన లోక యునెస్కో జాబితాలో చేరనుంది. ఈ మేరకు యునెస్కో ప్రతినిధులు జానపద, గిరిజన లోకలను సందర్శించి వివరాలు సేకరించారు. ప్రాచీన జానపద ఆదివాసీ సంస్కృతులు, కళలు ఆచార సంప్రదాయాలను సేకరించి జానపద, గిరిజన లోకల్లో ఉంచారు. మరోవైపు మైసూరు సందర్శించే పర్యాటకులకు మరో పర్యాటక కేంద్రంగా మారింది. జానపద లోకను సందర్శిస్తున్న పర్యాటకులు ఇక నుంచి గిరిజన లోకను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని మూలవాసులైన గిరిపుత్రులు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ఆచారాలు తదితర వాటిని ఐదు ఎకరాల విస్తీర్ణంలో గిరిజన లోకను కన్నడ సాంస్కృతిక శాఖ అభివృద్ధి చేసింది. జేనుకురుబరు, గొండరు, కుడియరు, మలెకుడియరు, హాలక్కి, ఒక్కలిగరు, గౌళిగ తదితర గిరిజనుల జీవనశైలి, అలవాట్లు, వృత్తులు, వేట, మనోరంజన తదితర వాటిని ప్రతిబింబించే ప్రతిమలు శిల్పాలు ఏర్పాటు చేశారు. పచ్చటి కుసుమల్లో నివసించే గిరిజనుల జీవన చిత్రాలతో పాటు గిరిజన పల్లె వాతావరణం కృత్రిమంగా కల్పించారు. శిల్పకళా నిపుణుడు డాక్టర్ టి.బి.సోలబక్కనవర్ నేతృత్వంలో జీవం ఉట్టిపడేలా గిరిజనుల జీవన శైలితో బొమ్మలు రూపొందించి అద్భుత ఉంచారు. కాడుగొల్ల దైవ జుంజప్పన గుడి నిర్మాణంలో, గిరిజన ఉత్సవాల కేంద్రం, గిరిజన శైలిలో క్యాంటీన్ నిర్మాణం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన లోకాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు జానపద లోక అధ్యక్షుడు హి.శి.రామచంద్రగౌడ తెలిపారు. సోలిగ, సిద్ది, జడభర, కూరగ తదితర జాతుల జీవనశైలి ప్రతిబింబించేలా బొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు గిరిజన లోకలో బొమ్మలు, గుడిసెలు తదితర వాటిని ఏర్పాటు చేసి చూపిస్తారు. ఆధునిక సమాజం ప్రభావం గిరిజనుల పై పడుతోంది. నిదానంగా గిరిజనుల ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, భాష, వేషధారణ తదితర వాటిల్లో మార్పు చోటు చేసుకుంటుంది. ముందు తరాల వారి కోసం వాటిని కాపాడే ప్రయత్నాలను జానపద లోక చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా గిరిజన లోకను ఏర్పాటు చేసింది. గిరిజనలోకలోకి ప్రవేశిస్తే అటవీ ప్రదేశంలోకి అడుగు పెట్టిన అనుభూతి కలుగుతుందని ఆచార్య రామచంద్రగౌడ తెలిపారు.



చలి కాచుకుంటున్న గిరిజనులు



విల్లంబులు సంధిస్తున్న గిరిజనులు



ఆకట్టుకునే పల్లెసీమలోని ఓ గుడిసె



ముచ్చట్ల కోసం రచ్చబండ



గిరిజనుల గుడిసె లోపల భాగం

కర్ర దెబ్బలకు బిహారు వాసి విషాదాంతం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో సజిత్ (34) అనే కార్మికుడు మరణించాడు. మైకో లేఅవుట్ పరిధిలోని కట్టప్ప గార్డెన్‌లో ముగ్గురు బిహారీలు బాడుగ ఇంట్లో ఉంటున్నారు. బిలిత్ ఇంటీరియర్ డిజైన్ కంపెనీలో సజిత్ పని చేసేవాడు. గురువారం రాత్రి ముగ్గురూ తమ గదిలో మద్యం పార్టీ చేసుకున్నారు. చిన్న విషయమై గొడవపడి ఇద్దరు కలిసి సజిత్‌పై కర్రతో దాడి చేశారు. కిందపడిన అతని గొంతు నులుమడంతో తీవ్రంగా గాయపడి అతను మరణించాడని డీసీపీ సారా ఫాతిమా తెలిపారు. నిందితులను మైకో లేఅవుట్ ఠాణా పోలీసులు అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

ప్రహరీ కూలి కార్మికుడి మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: బొమ్మసంద్ర పారిశ్రామికవాడలో ఒక ప్రహరీ కూలి పరశురామ్ (24) అనే కార్మికుడు మరణించాడు. మరో ఇద్దరు కార్మికులకు కాళ్లు విరిగాయి. బాధితులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పరశురామ్ రాయచూరు జిల్లా దేవదుర్గకు చెందిన వాడని గుర్తించారు. ఒక ప్రహరీ పక్కనే పునాది కోసం గుంత తవ్వుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. మరో ముగ్గురు కార్మికులు కొంత దూరంగా ఉండడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

తప్పు కొడుకుది.. శిక్ష తల్లిదండ్రులకు..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఒక బాలిక (17)ను ప్రేమించిన గురుకిరణ్ (20) అనే యువకుడు, ఆమెను తనతో లేవదీసుకుని పరారయ్యాడు. బాలిక తరఫు బంధువులు, కుటుంబ సభ్యులు అందరూ గురుకిరణ్ నివాసంపై దండెత్తి అతడి తల్లిదండ్రులపై దాడి చేసి గాయపరిచారు. బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చిన ఘటన దేవనహళ్లి తాలూకా బెంచనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. తమ కుమార్తెను లేవదీసుకుని వెళ్లి, వివాహం చేసుకున్నాడని విశ్వనాథపుర ఠాణాలో బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద అతనిపై కేసు నమోదు చేశారు. కేసు పెట్టిన అనంతరం గురుకిరణ్ తల్లిదండ్రులపై దాడి జరిగింది. వారి ఫిర్యాదుతో బాలిక తరఫు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బాలిక కేసులో వీడని చిక్కుముడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: తిలక్‌నగరలో రెండు నెలల క్రితం అనుమానాస్పదంగా మరణించిన గర్ల్ ముబీశర్ (13) అనే బాలిక కేసు విచారణ పోలీసులకు కొరుకుడుపడని మారింది. దంపతులకు గర్ల్ ఒక్కర్తే కుమార్తె. జయనగరలోని ఉషా అపార్ట్‌మెంట్‌లో వీరు ఉండేవారు. మే 22 సాయంత్రం ఏడు గంటలకు తన పిన్నితో కలిసి గర్ల్ బయటకు వెళ్లింది. తదుపరి రోజు పడకపై బాలిక మూర్ఛ వచ్చి పడిపోయింది. అస్వస్థత చెందిన తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆమె మరణించిందని వైద్యులు తెలిపారు. అనుమానాస్పదంగా మరణించిందని కేసు నమోదు చేసుకున్నారు. మరణోత్తర పరీక్ష నివేదికలో ఆమె ఊపిరి ఆడక మరణించిందని నివేదిక రావడంతో దాన్ని హత్య కేసుగా నమోదు చేసుకున్నారు. ఆమెకు ఊపిరి ఆడకుండా హత్య చేసిన హంతకుడు ఎవరని గుర్తించే దిశలో పోలీసులు గత రెండు నెలలుగా గాలింపు చేస్తూ వస్తున్నా, ఇప్పటి వరకు పోలీసులకు నిందితుడు దొరకలేదు.

సిలిండర్ పేలి ఆరుగురికి గాయాలు

దావణగెరె: దావణగెరె తాలూకా తుర్చఘట్ట గ్రామంలో గ్యాసు సిలిండరు పేలి ఆరుగురు గాయపడ్డారు. బాధితులను మునీర్‌సాబ్ (64), సుల్తాన్ (18), అల్తాఫ్ (15), తమన్నా (14), శబీనా బాను (34), ఫరీదా బాను (58)గా గుర్తించారు. వీరిలో మునీర్‌సాబ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

'బదిలీలు కోరుతూ కార్యాలయానికి రావద్దు'

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: బదిలీలు కోరుతూ తన కార్యాలయానికి రావద్దని నగర పోలీసు కమిషనర్ బి.దయానంద్ సిబ్బందిని కోరారు. సిఫార్సు పత్రాలు తీసుకుని, తన కార్యాలయానికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆడుగోడి సీఏఆర్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన వార్షిక కవాతులో సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని అందుకున్నారు. మరో మూడు నెలల్లో ఏడాది పూర్తవుతుందని, ఆ సమయంలో నగరంలో కట్టుదిట్టమైన భద్రత అవసరం అవుతుందన్నారు. ఈ సమయంలో బదిలీలు కోరవద్దని సూచించారు. అత్యవసరంగా బదిలీ అవసరమైతే డీసీపీలను సంప్రదించాలన్నారు. కొన్ని ఠాణాల్లో తమకు టీఏ, డీఏ అందడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని కేసులను ఇప్పటి సిబ్బంది ఉత్తమరీతిలో దర్యాప్తు చేసి పరిష్కరిస్తున్నారని అభినందించారు. నేరాలను నియంత్రించేందుకు క్రమం తప్పకుండా ప్రజలు, యువతకు జాగృతి కల్పించాలని పిలుపునిచ్చారు. దసరా, దీపావళి, క్రిస్మస్ సమయాల్లో భద్రతకు పెద్దపీట వేయాలని సూచనలు చేశారు.



కవాతు చేస్తున్న సిబ్బంది



ఓపెన్‌టాప్ వాహనంలో వెళ్తూ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న దయానంద్

అమరావతిలో అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి వినతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో అంతర్జాతీయ తెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలుగు విజ్ఞాన సమితి కోరింది. ప్రస్తుతం నెల్లూరులో ఉన్న తెలుగు పీఠం, అంతర్జాతీయ తెలుగు కేంద్రాన్ని అమరావతిలో నెలకొల్పి అభివృద్ధి చేయాలని, కళలు, వికాసానికి అంతర్జాతీయ స్థాయి కళా మందిరాన్ని నిర్మించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించామని సమితి అధ్యక్షుడు రాధాకృష్ణ రాజు తెలిపారు.



చంద్రబాబు నాయుడుతో రాధాకృష్ణ రాజు

నగరంలో పండ్లు కూరగాయల ధరలు

(హాప్ కామ్స్-కిలో..రూ.లలో)

బెంగళూరు(యశ్వంతపుర):

బీన్స్	- 55
క్యారెట్	- 70
బీరకాయలు	- 40
క్యాబేజి	- 20
కాలీఫ్లవర్(ఒక్కోటి)	- 25
సొరకాయ	- 35
దొడ్డకాయలు	- 40
పొట్లకాయ	- 35
టమాటా(నాటు)	- 55
టమాటా	- 45
గుమ్మడి	- 40
ఆలుగడ్డ	- 40
ఉల్లిగడ్డలు (మేలురకం)	- 70
ఉల్లిగడ్డలు (సాధారణ రకం)	-50
తెల్లగడ్డలు	- 390
సాంబారు ఉల్లి	- 120
బీట్‌రూట్	- 25
వంకాయలు	- 35
బెండకాయలు	- 40
ముల్లంగి	- 40
నిమ్మకాయ	- 200

పండ్లు, ఫలాలు ధరలు

ఆపిల్ వాషింగ్‌టన్	- 305
సిమ్లా ఆపిల్	- 145
గ్రీన్ ఆపిల్	- 335
అరటి కాయలు	- 45
సపోటా	- 55
పైనాపిల్	- 38
బొప్పాయి	- 45
ఆరంజి	- 80
బత్తాయి	- 60

రేపు విప్రో బెంగళూరు మారథాన్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: వివిధ సేవా కార్యక్రమాలకు నిధుల సేకరణకు, ప్రజారోగ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆదివారం బెంగళూరు మారథాన్‌ను నిర్వహిస్తున్నామని విప్రో సంస్థ ప్రకటించింది. ఆదివారం ఉదయం నిర్వహిస్తున్న విప్రో బెంగళూరు మారథాన్‌లో 30 వేల మంది ఔత్సాహికులు పాల్గొంటారని అంచనా. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ఎలైట్ రన్నర్లతో పాటు, నగరంలోని యువత, ఐటీ ఉద్యోగులు పరుగులో పాల్గొంటారని రేస్ డైరెక్టర్ నాగరాజ అడిగ తెలిపారు. ఎలైట్ రన్నర్లు ప్రదీప్ సింగ్, శ్రీను, సికందర్ తదితరులతో కలిసి శుక్రవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరుగుతో సేకరించిన నిధులను అనన్య ట్రస్టు, స్నేహగ్రామ్, పాజిటివ్ రన్నింగ్ ప్రోగ్రామ్, తాయి మనె, మధురధామ, తులిర్, శాస్త్రి స్పెషల్ అకాడమీ, సూర్యోదయ బాయ్స్ సెంటర్, బెంగళూరు స్కూల్స్ స్పోర్ట్స్ ఫౌండేషన్, టీసీఎఫ్ తదితర సంస్థలకు అందజేస్తామని చెప్పారు. ఐదు, పది కిమీ విభాగాల్లో నిర్వహించే మారథాన్ కంఠీరవ స్టేడియం నుంచి ప్రారంభమవుతుందన్నారు. వీటితో పాటు హాఫ్ మారథాన్‌ను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి పరమేశ్వర, ఎమ్మెల్సీ కే గోవిందరాజ్, క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, అశ్విని నాచప్ప, అంజు బాబీ జార్జ్ తదితరులు పరుగుకు జెండా ఊపనున్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు సౌరభ్ గోవిల్, మురళీ మైలయప్పన్ పాల్గొన్నారు.



ఎలైట్ రన్నర్లు ప్రదీప్ సింగ్, శ్రీను, సికందర్ తదితరులతో నాగరాజ అడిగ

రిజర్వేషన్లను మార్చలేదు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. శుక్రవారం ఇక్కడ కాంగ్రెస్‌భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నేతలు మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, ఎమ్మెల్సీ నాగరాజు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పీఆర్ రమేష్ తదితరులు మాట్లాడారు. పీడిత వర్గాలకు చెందిన రిజర్వేషన్లను తగ్గించి వాటిని ముస్లింలకు ఇస్తున్నారని హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తొలి నుంచి పీడిత వర్గాలకు ఉన్న రిజర్వేషన్లను రద్దు చేయాలని భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించారని, అదే ఓబీసీ విషయంలో ఎందుకు భాజపా నేతలకు శ్రద్ధ ఉండదని ప్రశ్నించారు.

స్టేషన్ పేరు మార్పు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: చిక్కపేట ట్రాఫిక్ ఠాణా పేరును చామరాజపేట ట్రాఫిక్ ఠాణాగా ప్రభుత్వం పేరు మార్చింది. చిక్కపేట ట్రాఫిక్ ఠాణా పరిధిలోని అన్ని ఫలకాల పేర్లను మార్చుతున్నామని పశ్చిమ విభాగం ట్రాఫిక్ డీసీపీ అనిత హద్దణ్ణనవర్ తెలిపారు. ఇకపై ప్రజలు చామరాజపేట ట్రాఫిక్ ఠాణా పేరిటే ఉత్తర ప్రత్యుత్తరాలు చేయవలసి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

మెట్రో మార్గంలో తనిఖీలు



నాగవార- మాదావర వరకు మెట్రో రైలు పొడిగింపు మార్గాన్ని తనిఖీలు చేస్తున్న కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషనర్ ఎ.ఎం.చౌధరి నేతృత్వంలోని నిపుణుల బృందం



పొడిగింపు మార్గంలో పట్టాలను తనిఖీలు చేస్తున్న సాంకేతిక నిపుణులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఉత్తర-దక్షిణ ఆకుపచ్చ మెట్రో కారిడార్ మార్గంలోని నాగవార- మాదావర పొడిగింపు మార్గాన్ని ఇక్కడ కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషనర్ ఎ.ఎం. చౌధరి నేతృత్వంలోని నిపుణుల బృందం తనిఖీలు పూర్తి చేశారు. 3.7 కిలోమీటర్ల పొడిగింపు నిర్మాణ పూర్తి చేసి ప్రయోగాత్మకంగా రెండు నెలలపాటు ఆ మార్గంలో రైలు సంచరించింది. పొడిగింపు మార్గంలో ప్రజలు సంచరించేందుకు ముందుగా ప్రాధికార కమిషనర్ అనుమతించాలి. అందులో భాగంగా కమిషనర్ నేతృత్వంలోని నిపుణులు బృందం నిర్మించిన మూడు మెట్రోస్టేషన్లు, రైలు పట్టాలు, సిగ్నల్ వ్యవస్థ, మలుపు వద్ద రైలు వేగం తదితర అంశాలను పరిశీలించినట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు పేర్కొన్నారు. తనిఖీలు పూర్తయిన తరువాత అధికారికంగా ప్రజలు సంచరించే తేదీలను ప్రకటిస్తారు. తుమకూరు, నెలమంగల ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఈ మార్గం మరింత అనుకూలమవుతుందని అధికారులు అంచనా వేశారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తున్నాం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: పీఈఎస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యా ప్రమాణాలు అందుతున్నాయని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కౌశల్యాభివృద్ధికి బజాజ్ ఇంజినీరింగ్ కౌశల్య శిక్షణ కేంద్రం (బెస్ట్)ను శుక్రవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. విద్యాభ్యాసంతో పాటే, విద్యార్థులు కౌశల్యాన్ని వృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోనూ ఈ తరహా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు విద్యాసంస్థలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇరు సంస్థల ప్రతినిధులు ఆచార్య దొరెస్వామి, ఆచార్య జవహర్, రవికిరణ్ రామస్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేదికపై డాక్టర్ సుధాకర్, ఆచార్య దొరెస్వామి, జవహర్, రామస్వామి తదితరులు

వాయుసేనలో వైద్య శిక్షణ పూర్తి



కవాతు చేస్తున్న అభ్యర్థులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: భారతీయ వాయుసేనలో వైద్య సహాయకులుగా శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది అభ్యర్థుల నుంచి ఎయిర్ వైస్ మార్షల్ రేణుకా కుంటె గౌరవ వందనం అందుకున్నారు. శిక్షణ సమయంలో ఉత్తమ ప్రతిభ చూపిన అంకిత్ డూడీ, అరుణ్ కుమార్, గిరికరణ్ ఆర్, జిష్ణు వివిధ విభాగాల్లో ట్రోఫీలు, ఫలకాలను అందుకున్నారు. చికిత్సలకు వచ్చే రోగులకు అంకితభావంతో సేవలు అందించాలని ఆమె పిలుపునిచ్చారు.

భాజపాపై మంత్రి భార్య ఫిర్యాదు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: భాజపా నాయకులు మత సామరస్యాన్ని దెబ్బతీసేలా, తనను, తన కుటుంబాన్ని అవహేళన చేస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు భార్య టబురావు ఆరోపించారు. తనపై ఆరోపణలు చేసిన మాజీ మంత్రులు, భాజపా నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్ణాటక మహిళా కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరికి ఫిర్యాదు చేశారు.

మేలుకోటెకు కిత్తూరు రథం

మండ్య, న్యూస్‌టుడే: కిత్తూరు రాణి చెన్నమ్మ జ్యోతి, రథం మేలుకోటెకు శుక్రవారం చేరుకున్నాయి. చెలువ నారాయణ స్వామి ఆలయం వెలుపల రథాన్ని నిలిపి గౌరవార్పణ చేశారు. కిత్తూరు ఉత్సవాలు విజయవంతం కావాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు రథాన్ని తీసుకువెళుతున్నామని అధికారి కేవి శాగనూర తెలిపారు. మేలుకోటెకు చేరుకున్న రథానికి యగ్గడహళ్లి కృష్ణేగౌడ నేతృత్వంలోని కళాకారులు స్వాగతించారు. ఆలయం పారుపత్తేగార ఎం.ఎస్.పార్థసారథి దేవాలయం తరఫున రథం, జ్యోతికి పూజ చేశారు.



ఆలయం వెలుపల కిత్తూరు రథం

ఛాతీని చీల్చిన గొట్టాన్ని బయటకు తీశారు

హుబ్బళ్లి: రాణెబెన్నూరు సమీపంలోని హోలిహళ్లి వద్ద గత బుధవారం వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో దయానంద శంకరబడగి (27) అనే క్లీనరు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు ఛాతీలోకి దూరిన ఒక గొట్టం వెన్ను పక్క నుంచి బయటకు వచ్చింది. బాధితుడికి దావణగెరెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి హుబ్బళ్లి కేఎంఆర్‌సి ఆసుపత్రికి తరలించారు. గురువారం అతని శరీరం నుంచి గొట్టాన్ని బయటకు తొలగించారు. కోలుకుంటున్న దయానంద శంకర బడగిని ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మార్చామని ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నాగరాజ చాంది తెలిపారు. అతని శరీరం నుంచి 98 సెం.మీ.ల గొట్టం దూరడంతో ఛాతీలో ఎముకలు కొన్ని చిట్లాయన్నారు. ఊపిరితిత్తులు కొంత దెబ్బతిన్నాయన్నారు. శస్త్రచికిత్స సమయంలో ఏడు సీసాల రక్తం వినియోగించామన్నారు. ఉచితంగా అతనికి శస్త్రచికిత్స నిర్వహించామన్నారు.

సీసీ కెమేరాలను తొలగించండి


చామరాజనగర, న్యూస్‌టుడే: దుకాణాల బయట ఉంచిన సీసీ కెమెరాలను తక్షణమే తొలగించాలని కొందరు నగల దుకాణదారులకు బెదిరింపు లేఖలు వచ్చాయి. మయూర, కార్తిక్ నగల దుకాణాలు, వాసుకియు షాపితో పాటు దొడ్డంగడి వీధిలో పలు దుకాణదారులకు కన్నడలో రాసిన లేఖలు అందాయి.

నిలిచిన కార్యాచరణ


కార్వార, న్యూస్‌టుడే: అంకోలా తాలూకా శిరూరు వద్ద కొండచరియలు విరిగిపడిన చోట గంగావళి నదిలో మృతదేహాలను గాలించేందుకు 13 రోజులుగా కొనసాగుతున్న కార్యాచరణను గురువారం సాయంత్రం నిలిపివేశారు. అర్జున్ మృతదేహం లభించడం, ఇద్దరు ఎముకలు లభించడంతో డ్రెజ్జింగ్‌తో కార్యాచరణను నిలిపి వేశామని అధికారులు తెలిపారు. హోటల్ కూలిన చోటు నుంచి నదిలో కొంత దూరం వరకు ఈత నిపుణులతో కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు. ఎముకలకు సంబంధించి డీఎన్‌ఏ నివేదిక వస్తే అవి ఎవరివో గుర్తించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు.

ఆటో చోదకుడు.. చివరికి చిక్కాడు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఎక్కువ బాడుగ ఇచ్చేందుకు నిరాకరించిన ఒక యువతిని దూషించిన ఆటో డ్రైవరు సంతోశ్ (26)ను మైకో లేఅవుట్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సిల్కు బోర్డు వెళ్లేందుకు వేచి ఉన్న ఆమె వద్దకు ఆటో డ్రైవరు వచ్చాడు. రూ.300 ఇవ్వాలని డ్రైవరు కోరగా, ఆమె రూ.150 ఇస్తానని చెప్పింది. ఒక్కసారిగా కోపం పెంచుకున్న నిందితుడు ఆ యువతిని అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె ఆ మాటలను చరవాణిలో రికార్డు చేసుకుని పోలీసుల ఎక్స్ కార్స్ ఖాతాలో పోస్టు చేసింది. స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు పూర్తి చేశారు. నిందితుడు బిలేకహళ్లికి చెందినవాడని పోలీసులు తెలిపారు.



భోగప్రద అలంకారంలో బనశంకరి దేవస్థానంలో కొలువైన శాకంబరి అమ్మవారు



వర్ణభరిత నిండు గాజులు ధరించిన తొలి ముత్తైదువు బనశంకరి మాత



మహేశ్వరి అలంకారంలో పార్వతీదేవి



కుంకుమ పుష్పఅలంకారంలో అంబాభవానీ

గాంభీర్యమూర్తి..నమోనమః

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల రెండోరోజైన శుక్రవారం అమ్మవార్లు శుక్రవారపు శుభ ముత్తైదువులుగా సుందర అలంకరణలలో దర్శనమిచ్చారు. ప్రముఖ బనశంకరిమాత దేవస్థానంలో బనశంకరీదేవి వర్ణభరిత గాజులను సింగారించుకుని మహిళలకు కనువిందు కలిగించింది. ఇదే దేవస్థానంలో కొలువైన శాకంబరీదేవి భోగప్రదగా భక్తులను సంతోషపరుస్తూ వరాల జల్లులు కురిపించింది. బలమురిశేష మహాగణపతి దేవస్థానంలో పార్వతీదేవి మహేశ్వరిగా అవతారమెత్తి కొబ్బరి ఈనెలతో రూపొందించిన సుందర ఆసనం అలంకార మధ్య కొలువై చిరునవ్వులు ఒలికించింది. కెంపేగౌడనగర్‌లో విరాజిల్లిన అంబాభవానీ మాత పట్టువస్త్రాలు కట్టి పసుపు కుంకుమలను నుదుటన అద్దుకుని, త్రిశూలం ధరించి గాంభీర్య మూర్తిగా ఒసగిన దర్శనం తిలకించి భక్తులు మురిసిపోయారు. హొరనాడులో ఆదిశక్త్యాత్మక అన్నపూర్ణేశ్వరిదేవి రెండోరోజు బ్రహ్మచారిణి అవతారమెత్తి (బ్రాహ్మణి) జ్ఞానబోధ చేయటం విశేషం.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు



చాముండేశ్వరికి పూజలు చేస్తున్న మంత్రి పరమేశ్వర్ దంపతులు, జిల్లాధికారి శుభాకల్యాణ్

చాముండి సేవలో మంత్రి పరమేశ్వర్ దంపతులు

తుమకూరు : దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతిష్ఠించిన చాముండేశ్వరిని మీనాక్షి అలంకారంతో ముస్తాబు చేసినట్లు దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు, జిల్లా అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి పేర్కొన్నారు. పూజా కైంకర్యాల్లో మంత్రి జి.పరమేశ్వర్, సతీమణి కన్నికా పరమేశ్వర్, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ అశోక్, సీఈఓ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, న్యూస్‌టుడే : చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.అరవింద్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు రాజగోపురం వద్ద స్వాగతం పలికారు వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ పర్యవేక్షకుడు కోదండ పాణి, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.



జస్టిస్ అరవింద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

తెలుగు పదానికి రంగు పూసిన దుండగులు

హోసూరు కబుర్లు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు పారిశ్రామికవాడలోని సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ వద్ద తమిళ, తెలుగులో సిప్‌కాట్ అని పోలీసులు వేయించిన ఫలకంలోని తెలుగు పదాలను గుర్తు తెలియని వ్యక్తులు నల్లరంగు పూశారు. తెలుగు భాషకు అవమానం చేసిన విషయం హోసూరు, చుట్టుపక్కల ప్రాంతంలో శుక్రవారం ప్రచారమైంది. హోసూరు పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో తెలుగు, కన్నడ ప్రజలను అవమానం చేసే విధంగా కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. తెలుగు ఫలకానికి రంగుపూసిన వ్యక్తుల గురించి పోలీసులకు తెలిసినా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ ఎస్.ఎ.సత్య ఈ విషయాన్ని ఏఎస్పీ దృష్టికి తెచ్చారు. గతంలో మూకండపల్లి ప్రాంతంలో బెంగళూరుకు చెందిన సిల్క్ షో రూం ప్రారంభించినపుడు షాపు పేరును తమిళ, తెలుగు, ఆంగ్లంలో రాయగా కొందరు వ్యక్తులు యాజమాన్యాన్ని బెదిరించి కన్నడ ఫలకాన్ని తొలగించారు.



తెలుగు అక్షరాలను తుడిచిన చిత్రం

పన్ను చెల్లింపు కేంద్రం ప్రారంభం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలోని నివాసులు పన్నులు చెల్లించడానికి వివిధ ప్రాంతాల్లో 8 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పాత మున్సిపాలిటీ భవనం, గాంధీ విగ్రహం, రైతు బజారు, మత్తిగెరి, మూకండపల్లి, జూజువాడి తదితర చోట్ల ఏర్పాటు చేసిన కేంద్రాలను మేయర్ ఎస్.ఎ.సత్య, కమిషనర్ శ్రీకాంత్, ఉప మేయర్ సి.ఆనందయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ టిట్టో, ఇంజినీర్ రాజారాం, ట్యాక్స్ కమిటీ ఛైర్మన్ చెన్నీరప్ప, కార్పొరేటర్ వరలక్ష్మి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



కౌంటర్లను ప్రారంభిస్తున్న మేయర్ సత్య, తదితరులు

దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లను ఎమ్మెల్యే వై.ప్రకాశ్ పరిశీలించారు. శిథిలమైన రింగ్‌రోడ్డు స్థితిగతులను చూసి మరమ్మతులపై అధికారులతో చర్చించారు. గుంతల్లో నీటిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డి.ఎం.కె.ప్రముఖులు యువరాజ్, సుకుమార్, కార్పొరేటర్ చెన్నీరప్ప తదితరులు పాల్గొన్నారు.



చర్చి వీధిలో తొలగిస్తున్న ఆక్రమణలు



ఉన్నతాధికారుల సమక్షంలో తొలగింపులు



దీపాంజలినగరలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

పాదచారి మార్గంలో ఆక్రమణల తొలగింపు

బెంగళూరు (యశ్వంతపుర) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పాదచారి మార్గం ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు పాలికె అధికారులు శ్రీకారం చుట్టారు. వివిధ ప్రాంతాల్లో తొలగింపు పనులు చేపట్టారు. ఉన్నతాధికారులు దగ్గర ఉండి ఆక్రమణలను తొలగిస్తున్నారు. చిన్న బంకులు, తోపుడు పండ్లు, దుస్తుల వ్యాపారం తదితర వాటిని తొలగించి సంబంధించిన చిరు వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఇక్కడ ఎంజీ రోడ్డు సమీపంలోని చర్చి వీధిలో పాదచారి మార్గం ఆక్రమణలను తొలగించడం మొదలు పెట్టారు. ప్రచార బోర్డులు, చిన్న బంకులను తొలగించి వాటిని వాహనంలో వేసి తరలించారు. పాదచారి మార్గంలో చిరువ్యాపారులు దుస్తులు, పండ్లు, కళ్లజోళ్లు, చరవాణి కవర్లు తదితర వాటిని తొలగించారు. ఈసందర్భంగా తూర్పు విభాగం సంయుక్త కమిషనర్ పల్లవి మాట్లాడుతూ చర్చివీధి, కమర్షియల్ స్ట్రీట్, ఎంజీరోడ్డు, జనరల్ కరియప్ప రహదారి తదితర ప్రాంతాల్లో పాదచారి మార్గం ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు.

స్లాబ్ తొలగించిన కార్మికుడికి జరిమానా :

రహదారి పక్కన వాననీటి కాలువపై వేసిన సిమెంట్ స్లాబ్‌ను తొలగిస్తున్న వ్యక్తులను గుర్తించిన పాలికె అధికారులు జరిమానా విధించి కేసు నమోదు చేశారు. లోతట్టు ప్రదేశమైన దీపాంజలినగర సిమెంట్ స్లాబ్‌ను కొందరు వ్యక్తులు తొలగించేందుకు సిద్ధమయ్యారు. తమ వాహనాల రాకపోకల కోసం కాలువలను తొలగించి మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని పాలికె అధికారులు గుర్తించారు. రహదారిపై పడిన వాననీరు కాలువలో ప్రవహించే విధంగా నిర్మించి స్లాబ్ వేశారు. మైసూరు రహదారిలోని దీపాంజలి నగర లోతట్టు ప్రదేశంగా గుర్తింపు పొందింది. చిన్న వర్షం కురిసినా ఆప్రదేశం ముంపునకు గురవుతోంది. రహదారి వాగులా మారుతుంది. రహదారిపై పడిన నీరు కిందకు ప్రవహించే విధంగా కాలువ నిర్మాణం చేపట్టారు. సకాలంలో తొలగింపును గుర్తించామని లేక పోతే వర్షకాలంలో కాలువకు అవతల ఉన్న ప్రదేశం ముంపునకు గురై ఉండేదని అధికారులు తెలిపారు.

ధర్మస్థలలో దసరా ఉత్సవాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ధర్మస్థలలో శరన్నవరాత్రి ఉత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. సంగీత కచేరీలో సుప్రీత ఆలపించిన కీర్తనలు, భక్తిగీతాలాపన ప్రేక్షకులను తన్మయులను చేసింది. విద్వాన్ పుత్తూరు నిక్షిత్ (మృదంగం), మాష్టర్ వర్చస్ (వయొలిన్), విద్యాన్ ఫణీంద్ర (ఘటం) అత్యుల్లతేజ్ (ఖంజీర) ప్రక్కవాద్య సహకారంతో కచేరీకి పరిపుష్టి చేకూర్చారు. కంచిమారు టైగర్స్ బృందంచే పులి తదితర జంతు విన్యాసాలు చూపరులకు ఆనందాన్ని కలిగించాయి. ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే కళాకారులను అభినందించి సత్కరించారు.



సుప్రీత సంగీత కచేరి

బాలకృష్ణ అభిమానులకు గణపతి లడ్డూ

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలో వినాయక చవితి సందర్భంగా విశ్వ హిందు పరిషత్, బజరంగ దళ కార్యకర్తలు ప్రతిష్ఠించిన హిందు మహా గణపతి లడ్డు ప్రసాదాన్ని వేలం వేశారు. నందమూరి బాలకృష్ణ తాలూకా అభిమానుల సంఘం అధ్యక్షుడు గంగినేని దేవరాజు బృందం వేలం పాటలో రూ.1,08,000 లకు పొందారు. ఆదివారం జరిగే వినాయక నిమజ్జన ఊరేగింపులో బాణసంచా కోసం లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వనున్నట్లు బాలకృష్ణ అభిమానుల సంఘ సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో కూరగాయల క్రిష్టప్ప, సిప్లన్ నాయుడు, కోట్లో సుబ్రహ్మణ్యం, గంగాధరనాయుడు, వళ్ళూరు గోవింద, బళసముద్రం రవి, గంగాధర పాల్గొన్నారు.



లడ్డూ ప్రసాదంతో బాలకృష్ణ అభిమానులు

సుందర.. బొమ్మల కొలువు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : దసరా సంబరాల్లో భాగంగా కర్ణాటకలో బొమ్మలకొలువులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. గృహాల్లో మహిళలు తీర్చిదిద్దే బొమ్మల కొలువుల్లో భారతీయ హైందవ కళా సంస్కృతుల, సంప్రదాయాల సందేశాలు పొందుపరిచి ఉంటాయి. నగరానికి చెందిన యశోద రూపొందించిన బొమ్మల కొలువులో అలాంటివి మనకు కనిపిస్తాయి. ఆమె ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు సామాజిక కుటుంబాల సమస్యలను పరిష్కరించే కౌన్సిలర్. విజయదశమి వరకు ఈ కొలువు కొనసాగుతుందని ఆమె చెప్పారు. ప్రతి రోజు ఈ బొమ్మలను సాటి మనుషులుగా, ప్రత్యక్ష దైవాలుగా భావించి మాట్లాడటం నైవేద్యాది మర్యాదలు చేసి ఆ ప్రసాదాన్ని వీక్షకులకు పంచిపెట్టటం చేస్తుండటం విశేషం.

వారసత్వం కొనసాగింపు

బెంగళూరు (క్రీడలు) : పరుగుల ప్రపంచంలో ప్రశాంతత చాలా అవసరం. పండగల ఆచరణలో భాగంగా వారసత్వంగా వస్తున్న బొమ్మల కొలువు ఏర్పాటు చేయడంతో ఆనవాయితీ. ఇంటింటా బొమ్మల కొలువుతో సందడి వాతవరణం నెలకొంది.. ముఖ్యంగా జేపీ నగర నివాసి పరశ్వరన్ ఇంట్లో 125 ఏళ్ల పైబడిన బొమ్మలను కొలువులో ఉంచారు. ఈ పురాతన బొమ్మలు చూసి అందరు ఆశ్చర్యపడుతున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వరన్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ అమ్మమ్మ మా అమ్మకు ఇచ్చిన బొమ్మలను భద్రపరస్తూ..ఏటా ఈ బొమ్మల కొలువులో పెడుతున్నట్లు తెలిపారు. అయోధ్య రామయ్య విగ్రహం కోసం వెతికామని చివరికి ముంబయి నుంచి విగ్రహాన్ని తెప్పించినట్లు చెప్పారు. పరమేశ్వరన్ తల్లి లలిత తిరుపతిలో ఏసీటీఓగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. అమ్మమ్మ, అమ్మల సంప్రదాయాన్ని ఆయన కుమారుడు అవినాష్ వారసత్వ బొమ్మలకొలువును కొనసాగిస్తున్నారు.



రాజస్థానీ వాద్య కళాకారులు



వందేళ్ల నాటి బొమ్మలు



కుమార్తె ప్రణతితో రూపకర్త యశోద

మోర్నపల్లిలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మోర్నపల్లి గ్రామంలో వెలిసిన పత్ర్యంగిర దేవతకు నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. అర్ధనారీశ్వర అలంకారంతోని అమ్మవారికి పూజలు చేశారు. మొదటి రోజు బాల దుర్గాంబిక అలంకారం చేశారు. దర్శనానికి బెంగళూరు, హోసూరు, ఆనేకల్, మాలూరు, చందాపుర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దేవతలకు మొక్కులు చెల్లించారు.



అర్ధనారీశ్వరి అలంకారం

నగరంలో కుండపోత వర్షం

తుమకూరు, న్యూస్‌టుడే : నగరంలో శుక్రవారం కురిసిన కుండపోత వర్షానికి రహదారులు చెరువులను తలపించాయి. బీహెచ్ రోడ్డులోని కాంప్లెక్స్, గాయిత్రీ థియేటర్ ముందు భాగంలో రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. మురికి కాలువలు పెల్లుబికి రహదారుల్లోకి చేరాయి. వాహనాలు నీట మునిగాయి. వర్షం నీటితో వాహన సంచారానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాదచారులు తడిసి ముద్దయ్యారు. తుమకూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. చలిగాలులతో పాటు ఆకాశం కారు మబ్బులు కమ్మాయి. వర్షంలోనూ దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



నీట మునిగిన వాహనాలు



బసవనగుడిలో వస్త్ర దుకాణం ప్రారంభం

బెంగళూరు (యశ్వంతపుర): కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఖ్యాతి పొందిన డ్రెస్‌సర్కిల్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ఇక్కడ సినీనటి ఆశికా రంగనాథ్, స్థానిక ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య తదితరులు ప్రారంభించారు. ఒకేచోట వస్త్రాలు దొరికే విధంగా షాపింగ్‌మాల్ ప్రారంభించామని ఎండీ గోపాల్‌రెడ్డి పాటిల్ తెలిపారు. దసరా, దీపావళి పండగలకు వినియోగదారులకు చౌకధరల్లో అందిస్తామన్నారు.

ఫిడే చెస్ విజేత వియాని ఆంటోనియా

బెంగళూరు (క్రీడలు) : దక్షిణ కన్నడ జిల్లా ఆతిథ్యం వహించిన మూడో అఖిలభారత ఫిడే ర్యాపిడ్ రేటెడ్ చదరంగం పోటీలో మంగళూరు వాసి, అంతర్జాతీయ మాస్టర్ వియానిఆంటోనియా విజేతగా, తెలంగాణకు చెందిన జె.సాయిఅగ్నిజీవితేష్ రన్నరప్‌గా నిలిచారు. గురువారం మంగళూరు టౌన్ హాల్‌లో జరిగిన తొమ్మిది రౌండ్‌ల పోటీల్లో వియాని, సాయి కలిసి 8.5 పాయింట్లు తెచ్చుకోగా, టై బ్రేక్ స్కోర్‌లో వియానీని విజయలక్ష్మీ వరించింది. ముగింపు వేడుకల్లో సునీల్ ఆచార్, ఎంఆర్‌పీఎల్ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.సుదర్శన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అమెజాన్ నగల పథకం ప్రారంభం

బెంగళూరు (యశ్వంతపుర): దసరా, దీపావళి పండగల సందర్భంగా అమెజాన్ గోల్డ్ ఫ్యూచర్ ద్వారా వినియోగదారులు బంగారు నగలు కొనుగోలు పథకాన్ని ప్రారంభించింది. ప్రముఖ బంగారు నగలు వ్యాపార సంస్థలు కళ్యాణ్, ఎంఎంటీసీ, తనిష్క, జోయాలూక్కాస్ నుంచి తమకు నచ్చిన బంగారు నమూనాలను అమెజాన్‌లో ఎంపిక చేసుకుని కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలియజేసింది.



బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

ధర్మ పరిరక్షణకు మఠాల కృషి

రాయచూరు, న్యూస్‌టుడే : శాంతిని కాపాడేందుకు, ధర్మ పరిరక్షణకు మఠాలు చేస్తున్న సేవలు అనన్యమని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ కొనియాడారు. ఆయన శుక్రవారం కిల్లే బృహన్మఠంలో శ్రీదేవి మహాపురాణ ప్రవచన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక యుగంలోని ప్రజలు నెమ్మది జీవితాన్ని కొనసాగించలేకపోతున్నామని, ఒత్తిళ్ల మధ్యనే ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. ప్రశాంతత మఠాల్లో లభిస్తున్నందున తరచూ వెళ్లాలని కోరారు. మఠం స్వామి శాంతమల్ల శివాచార్యులు మాట్లాడుతూ భక్తులు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక దాన ధర్మాలు చేసి పుణ్యం సంపాదించుకోవాలన్నారు. శ్రీదేవి పురాణ ప్రవచనాలను ఆలకిస్తే అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని తెలిపారు. ఎమ్మెల్సీ వసంతకుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



రూ.2 కోట్ల విలువైన భూమి స్వాధీనం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సీవీ రామనగర ప్రాంతంలోని కగ్గదాసపుర చెరువు ఆక్రమణలను పాలికె అధికారులు తొలగించారు. శుక్రవారం ఇక్కడ గట్టి పోలీసు బందోబస్తు మధ్య అధికారులు జేసీబీ యంత్రాల సాయంతో నిర్మించిన ప్రహరీ, రెండు షెడ్లను కూల్చివేశారు. రూ.2 కోట్ల విలువైన 2.50 ఎకరాల భూమి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టు కంచె ఏర్పాటు చేశారు.

← కగ్గదాసపుర చెరువు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

కల్యాణ కర్ణాటక ప్రగతికి గోవిందరావు సమితి

సింధనూరు, న్యూస్‌టుడే: నంజుండప్ప నివేదిక అమలులో జరుగుతున్న లోటుపాట్లను గుర్తించి వాటిని క్రమ పద్ధతిలో అమలు చేయడానికి కొత్తగా గోవిందరావు సమితిని ఏర్పాటు చేశాం..గోవిందరావు సమితి నివేదిక అందాక కల్యాణ కర్ణాటకను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. శుక్రవారం రాత్రి స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన సింధనూరు దసరా ఉత్సవాల ప్రారంభ వేడుకలో పాల్గొని ఆయన మాట్లాడారు. మాకు పాత మైసూరు, మంగళూరు-ఉడిపి ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి కల్యాణ కర్ణాటకలోనూ చూడాలన్నదే ఆశ. మా ప్రభుత్వం దీనికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవల కలబురగిలో జరిపిన ప్రత్యేక మంత్రిమండలి సమావేశంలో ఏకకాలంలో 11 వేల కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశాం, ఒకే ఒక్క కేబినెట్లో ఇంత పెద్దమొత్తంలో అభివృద్ధికి పచ్చజెండా ఊపడం ఇదే తొలిసారి అని చెప్పారు. 371జే కృప మా కాంగ్రెస్ ప్రభుత్వానిదే. దీనికి కృషి చేసిన మా నేతలకు ఈ ప్రాంతం ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారని గర్వంగా చెప్పారు. తొలుత ఆయన రూ.1695 కోట్లతో సింధనూరు-కల్మల (రాయచూరు) 78 కిలోమీటర్ల పొడవునా నాలుగు లైన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎస్ బోసురాజు, తంగడిగి, ఎంపీ రాజశేఖర్, ఎమ్మెల్యేలు ఆర్.బసనగౌడ, హంపయ్యనాయక్, దద్దల్, నాగరాజు, ఎస్.సి.బాలకృష్ణ రాఘవేంద్ర హట్నాళ్, డీసీ, ఎస్పీ, స్థానిక నాయకులు నాడగౌడ, కేవీ పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

రాయచూరు, న్యూస్‌టుడే: కర్ణాటక సంభ్రమ-50 వేడుకలు, 1980న బెళగావి జిల్లా గోకాక్‌లో కన్నడను రక్షించుకునేందుకు జరిగిన పోరాట నేపథ్యాన్ని మననం చేసుకునేందుకు శనివారం రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణలో సభను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్, పలువురు మంత్రులు హాజరవుతున్నందున ప్రాధాన్యం ఏర్పడింది. వేదిక, సభాస్థల నిర్మాణ పనులు ముగింపు దశకు చేరాయి. చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. వేగంగా పనులు జరగడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. సభలో సమస్యలు తలెత్తకుండా విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. జడ్పీ సీఈవో రాహుల్, జిల్లా అదనపు పాలనాధికారి శివానంద హాజరయ్యారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బోసురాజు

ప్రభుత్వాన్ని అస్థిర పరిచే కుట్ర

సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు భాజపా, దళ్ పార్టీ కుట్ర పన్నుతున్నాయని మంత్రి బోసురాజు ఆరోపించారు. ఆయన రాయచూరులో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామి, భాజపా నేత అశోక్ మతి స్థిమితం కోల్పోయి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడినప్పుడు నుంచి దించేందుకు చేస్తున్న కుతంత్రాలు ఫలించబోవన్నారు. సిద్ధరామయ్యను మార్చేందుకు రూ.1200 కోట్లతో సిద్ధంగా ఉన్నారని భాజపా ఎమ్మెల్యే యత్నాళ్ చెబుతుంటే, ముడా అక్రమాలపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. తాజాగా పారిశ్రామికవేత్త ఒకరు కుమారస్వామి డబ్బులు అడిగారని కేసు పెట్టారని, దీనిపై ప్రతిపక్షాలు ఏమి సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. దళ్ ఎమ్మెల్యే దేవెగౌడ ముడా విషయంలో ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ప్రకటించడం చూస్తే సీఎంపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టమవుతోందని మంత్రి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రాక కోసం ముస్తాబైన మాన్వి

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు సర్వ సిద్ధమైంది. ఐదారు రోజులుగా పార్టీ నాయకులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పర్యవేక్షణలో యువ కాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజు ముందుండి వేదిక నిర్మాణం పనులు చేయిస్తున్నారు. స్థానిక సూర్యఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో వేదికను సిద్ధం చేశారు. 50 వేల మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.



వేదిక పనులు పర్యవేక్షిస్తున్న రవిబోసురాజు, ఈరణ్ణ తదితరులు



చురుగ్గా సాగుతున్న సీఎం సభా వేదిక నిర్మాణం

ముఖ్య వేదికపై 50 నుంచి 60 మంది నాయకులు, ప్రముఖులు కూర్చోవడానికి ఎత్తుగా వేదిక నిర్మించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి మాన్వి ఎక్స్‌ప్రెస్ బస్టాండ్, నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, వివిధ వసతి నిలయాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సీఎంతో బాటు ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మంత్రులు ఎన్.ఎస్.బోసురాజు, శరణప్రకాష్‌పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప, మునియప్ప, శివరాజ్ తంగడిగి, రహీంఖాన్, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొంటున్నారు.

వర్గీకరణ చేస్తామని సీఎం ప్రకటించాలి

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు పర్యటనలో దళిత వర్గీకరణ చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించాలని రిజర్వేషన్ల ఐక్య పోరాట సమితి సంచాలకుడు విరూపాక్షి డిమాండ్ చేశారు. ఉదాశీన వైఖరి అవలంబిస్తే తీవ్ర స్థాయిలో పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన శుక్రవారం పత్రికాభవన్‌లో స్థానికవేత్తలు సమావేశంలో మాట్లాడారు. రాజకీయ నేతల ఒత్తిడిని పట్టించుకోకుండా సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం మేరకు నడుచుకోవాలని కోరారు. కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్ నేతలు అమలు చేయడంలో ఎందుకు ఆసక్తి చూపడం లేదని ప్రశ్నించారు. ఆది ద్రావిడ, ఆది కర్ణాటక వర్గాలను గణన చేసేందుకు ఎలాంటి గందరగోళానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. వర్గీకరణను జాప్యం చేసేందుకు సాకులు చెబుతున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. సమితి ప్రముఖులు అంబణ్ణ ఆరోలి మాట్లాడుతూ విభజించడం వల్ల దొరుకుతుందని మేలు జరుగుతుందని తెలిపారు. జిల్లా బంద్ విజయవంతానికి సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. జె.బి.రాజు, రామచంద్ర బోరెడ్డి, పి.యల్లప్ప, అనిల్‌కుమార్, రాజు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న విరూపాక్షి

ఇక మెట్రో ఛార్జీల బాదుడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నమ్మ మెట్రో రైలు ప్రయాణ చార్జీలు పెంచనున్నారు. అందుకోసం బీఎంఆర్‌సీఎల్ కొత్త ఛార్జీలను ప్రకటించనుంది. అందులో భాగంగా ముందస్తుగా ప్రయాణికులు, ప్రజలు నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తోంది. ఈనెల 21లోగా తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని మెట్రో రైలు ఛార్జీల నిర్ణయ సమితి విజ్ఞప్తి చేసింది. తమ అభిప్రాయాలు సహాలను అంతర్జాలం, లేఖలు ద్వారా తమ అభిప్రాయాలను పంపించాలని కోరింది. సమితి ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఛార్జీలను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం కనీస ఛార్జీ రూ.10, తుది ఛార్జీ రూ.60 అమలులో ఉంది. నాజూకు కార్డులు, క్యూఆర్ కోడ్ టికెట్లపై ఐదు శాతం రాయితీ ఇచ్చారు. నిర్వహణ, వేతనాలు, రుణాలు చెల్లింపు తదితర వాటి కారణంగా ఛార్జీలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు. మెట్రో స్టేషన్‌లో ఆత్మహత్య సంఘటనలు ఎక్కువ అవుతుండటంతో స్టేషన్లలో భద్రత గోడలను ఏర్పాటు చేయాలని బీఎంఆర్‌సీఎల్ తీర్మానించింది. ప్లాట్‌ఫాం భద్రత గోడలు ఏర్పాటుకు రూ.700 కోట్లు నుంచి రూ.800 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ ఖర్చు ప్రయాణికులు భరించాల్సిన పరిస్థితులు వచ్చాయి.



నాడహబ్బ ఉత్సవంలో ప్రముఖులు



ముత్యాలమ్మకు అలంకారం



నగరేశ్వర దేవస్థానంలో వెంకన్నకు పల్లకి సేవ

మార్మోగుతున్న దుర్గామాత నామస్మరణ

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శక్తి స్వరూపిణి, అమ్మలగన్న అమ్మ, భవానీ, ముత్యాలమ్మ, మారెమ్మ, కాళికా దేవి, సంతోషిమాత ఇలా విభిన్న రూపాల్లో వెలసిన దుర్గాదేవికి శుక్రవారం విశేష పూజలు చేశారు. ఆలయాల్లోని దేవతా మూర్తులను సుందరంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవారి మాలాధారులు తెల్లవారుజామునే ఆలయానికి వస్తున్నారు. బంగికుంట ప్రాంతంలోని పాత యూనియన్ బ్యాంక్ ఎదుట ప్రతిష్ఠించిన భవానీమాత విగ్రహానికి భక్తులు పోటెత్తారు. వెంకన్న దేవస్థానాల్లో ఉత్సవాలు ఘనంగా చేస్తున్నారు. ఉప్పారవాడ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో గురువారం రాత్రి దసరా ఉత్సవాలు అట్టహాసంగా మొదలయ్యాయి. సూర్యవాహనంపై ఆశీనుడైన శ్రీనివాసుడిని ఉప్పారవాడ పురవీధుల్లో ఊరేగించారు. స్వామికి భక్తులు నీరాజనాలు పట్టారు. నగరేశ్వర దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడి పల్లకీ సేవ నిర్వహించారు. చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. నిజలింగప్ప కాలనీలో నాడహబ్బ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శ్రీదేవి పురాణ ప్రవచనాన్ని విన్పించారు. ఉత్సవ సమితి సభ్యులు రుద్రప్ప అంగడి, శరణబసవ బల్లటగి, స్థానికులు హాజరయ్యారు. గద్వాల్ రహదారిలోని మాతా మహాలక్ష్మి, కాళికాదేవి, తిమ్మాపూర పేటలోని తిమ్మప్ప దేవాలయాల్లో బ్రహ్మముహూర్తంలో పూజలు ప్రారంభిస్తున్నారు. ఆలయాల ప్రాంగణాలు భక్తజనంతో సందడిగా మారాయి.

మాన్వి, న్యూస్‌టుడే : శరన్నవ రాత్రి వేడుకలను మాన్వి, సిరివార తాలూకాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. క్యాంపుల్లోని దేవాలయాల్లో అమ్మవార్ల విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కల్మల పరిధిలోని మారెమ్మ క్యాంపులో అమ్మవారి ఆలయంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల సాన్నిధ్యంలో పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి.



పాత యూనియన్ బ్యాంక్ వద్ద భవానీ



మారెమ్మ క్యాంపులో గాయత్రిదేవి

వైద్య సీటు ఇప్పిస్తామని వంచన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: మీ కుమార్తెకు మెడికల్ సీటు ఇప్పిస్తామని పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక పారిశ్రామికవేత్త నుంచి రూ.1.57 కోట్లు తీసుకుని వంచించిన విరూపాక్ష, మంజప్ప అనే వంచకులను బ్యాటరహళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. పారిశ్రామికవేత్త నుంచి వీరిద్దరూ 2022లో నగదు తీసుకున్నారు. మా ప్రయత్నాలు విఫలం అయ్యాయని, మీ నగదును షేరు మార్కెట్లో మదుపు చేశామని నిందితులు చెప్పారు. త్వరలో ఆ నగదు రెట్టింపు అవుతుందంటూ, రెండేళ్లపాటు కాలం గడిపేశారు. తాను ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలంటూ ప్రాణహాని తలపెడతామని బెదిరిస్తుండడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాచరణ నిర్వహించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణ చేపట్టారు.

మూడు కళాశాలలకు బాంబు బెదిరింపు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: 'మీ కళాశాలలో బాంబు పెట్టాం. త్వరలో అది పేలిపోతుంది' అంటూ మూడు కళాశాలలకు ఇ-మెయిల్‌లో శుక్రవారం బెదిరింపులు వచ్చాయి. బీఐటీ, ఎంఎస్ రామయ్య, బీఎంఎస్ కళాశాలలకు వచ్చిన బెదిరింపులపై కళాశాల యాజమాన్యాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. బాంబు నిష్క్రియదళం, శ్వానదళంతో వచ్చిన సిబ్బంది మూడు చోట్ల క్షుణ్నంగా తనిఖీలు పూర్తి చేసి అది ఉత్తుత్తి బెదిరింపుగా తేల్చారు. తదుపరి దర్యాప్తు బాధ్యతలను ఆయా ఠాణాల పోలీసులకు అప్పగించారు.

వైట్‌ఫీల్డ్‌లో యువతి బలవన్మరణం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: వైట్‌ఫీల్డ్ ప్రశాంత్ లేఔట్‌లో తాను ఉంటున్న పీజీలో పై అంతస్తు నుంచి కిందకు దూకి అనే గౌతమి (26) అనే యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడింది. కడపకు చెందిన ఆమె నగరంలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిని. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, దర్యాప్తు చేయవద్దని ఆత్మహత్యకు మునుపు రాసిన లేఖలో ఆమె పేర్కొంది. ఆత్మహత్య చేసుకుంటున్నందుకు తనను క్షమించాలని అదే లేఖలో తన తల్లిదండ్రులను కోరింది. వైట్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫార్మా రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

రాయచూరు, న్యూస్‌టుడే : ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నవోదయ విద్యా సంస్థల రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళాశాల సభాప్రాంగణంలో ఫార్మసీలో చేరిన నూతన విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంచుకుంటూ, నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే సులభంగా ఉద్యోగం లభిస్తుందన్నారు. నవోదయలో అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయం, మెరుగైన ప్రయోగశాలలు, నిపుణులైన అధ్యాపకులు ఉన్నందున ఏటా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంక్‌లు సాధిస్తున్నారని వివరించారు. కన్నడ మాధ్యమంలో చదివామని, గ్రామీణ నేపథ్యముందని బెంగపెట్టుకోవద్దని కోరారు. ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా బోధనలు చేస్తారని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ దొడ్డయ్య మాట్లాడుతూ పరిశోధనలు, ఆవిష్కరణలు చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. నిబద్ధతతో, ప్రణాళిక బద్ధంగా, కఠోరంగా శ్రమిస్తే విద్యా సంస్థలను స్థాపించే స్థాయికి ఎదగవచ్చని నిరూపించిన నవోదయ సంస్థల అధ్యక్షుడు రాజేంద్రరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పరిపాలనా నిర్దేశకుడు సురేష్‌బాబు, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ శివరాజగౌడ, డాక్టర్ ప్రజ్ఞా పాటిల్, అధ్యాపకురాలు అపర్ణ లక్ష్మి పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శ్రీనివాస్

చర్చల్లో 200 మంది ప్రతినిధులు

'వైద్య రంగం కార్యకలాపాలు-ముందంజ' అనే అంశంపై నవోదయలో జాతీయ సమ్మేళనం జరుగుతున్న విషయం విదితమే. కృత్రిమ మేధస్సుపై శుక్రవారం జరిగిన చర్చల్లో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. నిపుణ వైద్యులు శ్రీకాంత్ హెగ్డే, మల్లేశ్ గౌడ, సంజయకుమార్ అడ్డా, మహేశ్‌బాబు అనుమానాలను నివృత్తి చేశారు.

పింజార్లకు నిగమ అవసరం

రాయచూరు, న్యూస్‌టుడే : పింజార నదాఫ్ సామాజికవర్గానికి నిగమను స్థాపించాలని పింజార నదాఫ్ మన్సూరి హక్కుల సంఘం అధ్యక్షుడు ఇమ్రాన్ బడేసాబ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా జనాభా ఉన్న ఈ సామాజిక వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిగమను ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. చాలా సార్లు పోరాటాల ద్వారా ప్రభుత్వానికి విన్నవించామన్నారు. సమావేశంలో ప్రతినిధులు జావీద్, ఇమామ్ పాషా, షఫి, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.



విలేకరులకు వివరిస్తున్న ఇమ్రాన్

చిరుద్యోగుల శివాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలో సేవలు అందిస్తున్న పీడీవో కార్యదర్శులు, గుమస్తాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జవాన్లు తదితర సిబ్బంది ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శుక్రవారం విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. వేర్వేరు జిల్లాలు, తాలూకాల నుంచి వచ్చిన ఉద్యోగులు స్వాతంత్ర్య ఉద్యానంలో బైఠాయించారు. పీడీవో పోస్టులను బీ గ్రేడుకు ఉన్నతీకరించడం, సీనియారిటీకి అనుగుణంగా పదోన్నతులు, సిబ్బంది అందరికీ సకాలంలో పదోన్నతులు ఇవ్వడం, పీఎఫ్, బీమా సదుపాయాలు కల్పించడం, జిల్లా పంచాయతీ సీఈవో అధికారి పోస్టులకు గెజిటెడ్ అధికారులను నియమించడం ప్రధాన డిమాండ్లని పంచాయతీ రాజ్ ఉద్యోగులు, సిబ్బంది, సభ్యుల సమాఖ్య అధ్యక్షుడు వరదరాజు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే తమ ఆందోళనను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమాఖ్య డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న పోరాటానికి భాజపా ఎమ్మెల్సీ చలువాది నారాయణ స్వామి మద్దతు ప్రకటించారు.



ధర్నాలో సమాఖ్య ప్రతినిధుల నినాదాలు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

సిరివార, (మాన్వి) : తాలూకాలోని మాడగిరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మాన్వికి చెందిన శ్రీవెంకటేశ్వర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె, మధుమేహం, చర్మవ్యాధి, పిల్లల ఆరోగ్యానికి సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. 120 మంది పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో వైద్యులు కుమార్‌గౌడ, వినితాపాటిల్, రవికుమార్, శరణుపాటిల్, వలిపాషా, తాలూకా పంచాయతీ, గ్రామ పంచాయతీ సభ్యులు, మాజీ సభ్యులు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జీవిత బీమా ఏజెంట్ల నిరసన

మాన్వి, న్యూస్‌టుడే : జీవిత బీమా సంస్థ ఏజెంట్ల హితాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు సీఐటీయూ ఆధ్వర్యంలో జీవిత బీమా కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏజెంట్ల కమిషన్ తగ్గించటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారుడు రూ.లక్ష తీసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. గ్రూప్ బీమాను పెంచాలని కోరారు. ఏజెంట్లకు పాతపద్ధతిలో కమిషన్ ఇవ్వాలన్నారు. ఈ మేరకు జీవిత బీమా కార్యాలయం మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం ఉపాధ్యక్షుడు గిరియప్ప పూజార్, కార్యదర్శి జి.శ్రీనివాస్, దొడ్డనగౌడపాటిల్, ఈరణ్ణ, విరూపాక్షప్ప, గురుపాదయ్యస్వామి, అమరేశ్ ఇటగి, రంగప్ప, బూదయ్యస్వామి, కుబేరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నివాసాలపై ఈడీ అధికారుల దాడులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: జాతీయ బ్యాంకుల్లో సేవలు అందిస్తున్న అధికారులు, ఉద్యోగుల నివాసాలపై ఈడీ అధికారులు గురువారం సాయంత్రం దాడి చేశారు. శుక్రవారం సాయంత్రం వరకు దాడి కొనసాగింది. బెంగళూరులో ఐదు చోట్ల దాడులు జరిగాయి. ఉద్యోగుల నివాసాల నుంచి పలు దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులను ఈడీ అధికారులు జప్తు చేసుకున్నారు. మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌కు చెందిన నగదును వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలపై దిల్లీలోని ఈడీ ముందుకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ దాడులు జరిగాయని సమాచారం.

పరిహారంపై ధర్మాసనం స్టే

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: క్యాబ్‌లో ప్రయాణిస్తున్న ఓ యువతిపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో బాధితురాలికి ఓలా సంస్థ రూ.5 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని ఏకసభ్య పీఠం ఇచ్చిన ఆదేశాలపై జస్టిస్ ఎస్ఆర్ కృష్ణమూర్తి, జస్టిస్ ఎంజీ ఉమ పీఠం శుక్రవారం స్టే ఇచ్చింది. డ్రైవరు తమ సంస్థ ఉద్యోగి కాదని, ఒప్పంద పద్ధతిలో సేవలు అందిస్తున్నాడని ఓలా క్యాబ్ మాతృ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ తరపు న్యాయవాది తెలిపారు. దిగువ పీఠం ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని వేసుకున్న అర్జీపై స్టే విధించిన న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబరు 28కి వాయిదా వేసింది.

సీసీబీ పోలీసులపై ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో గత మే 19న జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్న వారి నుంచి సీసీబీ పోలీసులు నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని సహ కార్యకర్త విజయ్ డెన్నిస్ ఆరోపించారు. మీపై కేసు లేకుండా చేయాలన్నా, మాదక ద్రవ్యాలు తీసుకోలేదని నివేదిక ఇవ్వాలన్నా నగదు ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఆయన శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ రికార్డింగ్‌లు, కొన్ని వాట్సప్ స్క్రీన్ షాట్లను ఆయన తన ఫిర్యాదు ప్రతితో, రెండు చోట్లా దాఖలు చేశారు. కొందరి నుంచి రూ.10 లక్షలు, మరికొందరి నుంచి రూ.4.2 లక్షలను డిమాండ్ చేశారని విజయ్ డెన్నిస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర్చకురాలి ఆత్మహత్య

రాయచూరు : దొంగ రాంపుర్ గ్రామంలో మంజుళ (42) అనే మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సదరు మహిళ గ్రామంలోని ఒక దేవాలయంలో అర్చకురాలిగా పనిచేసేది. ఒంటరి మహిళ కావడంతో మానసికంగా కుంగిపోయి బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. యాపలదిన్ని ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

04-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1617.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,948	3,702
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,187	9,737
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	53.726

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఇప్పుడు విజయ్ టాటా వంతు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: గత నెల వరకు జనతాదళ్‌లో క్రియాశీలకంగా ఉన్న భూవ్యాపారి విజయ్ టాటాపై మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ అమృతహళ్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. విజయ్ టాటా తనను రూ.100 కోట్లు ఇవ్వాలని ఒత్తిడి చేశారని, తన వద్ద నగదు లేదని చెప్పడంతోనే ప్రత్యారోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.50 కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, రూ.5 కోట్లు ఇవ్వాలని రమేశ్ గౌడ తనను బెదిరించారని విజయ్ టాటా ఇప్పటికే అమృతహళ్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా రమేశ్‌గౌడను ఏ1గా, కుమారస్వామిని ఏ2గా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇరు ఫిర్యాదులను పోలీసులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారని నగర పోలీసు కమిషనర్ బీ దయానంద్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. కుమారస్వామి, రమేశ్‌గౌడ నగదు డిమాండ్ చేసినట్లు ఆధారాలు ఉంటే తీసుకురావాలని విజయ్ టాటాకు పోలీసులు సూచించారు.



మాట్లాడుతున్న రమేశ్‌గౌడ

'ఆ భూమిని కొనుగోలు చేశా'

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: లొట్టగొల్లహళ్లి వద్ద తాను డబ్బు చెల్లించి కొనుగోలు చేసుకున్న భూమిని కూడా వివాదంలోకి లాగేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని విపక్ష నేత అశోక్ ఆరోపించారు. తాను ఏ భూమినీ డీనోటిఫికేషన్ చేయించలేదని, 'పసుపు-కుంకుమ' కింద ఎవరూ భూమి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇదే విషయమై గతంలోనూ ఫిర్యాదులు వచ్చాయని, తాను ఎలాంటి తప్పు చేయలేదని అప్పటి గవర్నర్ క్లీన్ చిట్ ఇచ్చారని గుర్తు చేశారు. సిద్ధరామయ్య, ఇతర మంత్రులపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానమూ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన ఘటనను మళ్లీ ఉద్దేశపూర్వకంగా అధికార పార్టీ లేవనెత్తుతోందని దుయ్యబట్టారు.



అశోక్